మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385 www.evarthalu.com

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 4-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 244 Issue: 244

04 మార్చి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:36 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి పాడ్యమి సా. 4:53 వరకు తరువాత విదియ సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) ఉ. 7:35 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం ధృతి ఉ. 8:50 వరకు కరణం కౌలవ సా. 4:53 వరకు తైతుల తె. 4:540 వరకు వర్జ్యం మ. 3:01 నుండి సా. 4:40 వరకు దుర్ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:51 వరకు రాహుకాలం మ. 12:28 నుండి మ. 1:55 వరకు యమగండం ఉ. 8:04 నుండి ఉ. 9:32 వరకు గుళికాకాలం ఉ. 11:00 నుండి మ. 12:28 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:00 నుండి తె. 5:48 వరకు అమృత ఘడియలు రా. 12:52 నుండి రా. 2:31 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana





ఖగోళంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఈ సంవత్సరం అత్యంత కీలక ఘటనగా భావిస్తున్న సంపూర్ణ ద చంద్ర గ్రహణం మంగళవారం వివిధ ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది. అమెరికాలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వద్ద చందమామ రుధిర వర్ణంలో మెరిసిపోయాడు.




అమెరికా-ఇజ్రాయెల్ భీకర దాడుల్లో ఇరాన్ మినాబ్‌లోని ఓ స్కూల్‌లో 180 మంది మరణించిన విషయం తెలిసిందే. మృతుల్లో 165 మంది బాలికలు ఉన్నారు. ప్రాణాలు కోల్పోయిన చిన్నారులందరినీ ఒకే చోట సమాధి చేశారు. ఇందుకోసం పెద్ద సంఖ్యలో సమాధులు తవ్విన ఫొటోను ఇరాన్ మంత్రి అబ్బాస్ విడుదల చేశారు. చిన్నారుల అంతిమయాత్రలో ఇరాన్ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## యూట్యూబ్‌లో మోదీ రికార్డు

### 3 కోట్ల సబ్‌స్క్రైబర్లతో నం.1 లీడర్

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాదరణ క్షేత్రస్థాయిలోనే కాకుండా డిజిటల్ వేదికలపై కూడా తిరుగులేదని మరోసారి నిరూపితమైంది. ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌లో ఆయన అధికారిక ఛానల్ 30 మిలియన్ల (3 కోట్లు) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని దాటింది. తద్వారా -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,762 |
| వెండి (గ్రాము): | రూ.315 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,976 |

## విశ్వవాణి



సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకు దుబాయ్‌లోని హోటళ్లలో చిక్కుకున్న విదేశీ అతిథుల బసను కొనసాగించాలని దుబాయ్ సర్కారు అన్ని హోటళ్ల యాజమాన్యాలను ఆదేశించింది. బసకు సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని హామీ ఇచ్చింది.

# లావైపోతున్నారు!

### పట్టణ పురుషుల్లో 29.8% మందికి ఊబకాయం

### 33.2 శాతం మంది మహిళల్లో అధిక బరువు

### 2035 నాటికి 8.3 కోట్ల పిల్లల్లో ఊబకాయం

## నేడు ప్రపంచ ఊబకాయ దినోత్సవం





యాంత్రిక యుగంలో మానవ జీవనశైలి సమూలంగా మారిపోయింది. ఒకప్పుడు శారీరక శ్రమతో ముడిపడి ఉన్న దైనందిన జీవితం, నేడు గంటల తరబడి కుర్చీలకు పరిమితమయ్యే 'నిశ్చల జీవనశైలి'గా రూపాంతరం చెందింది. ఈ మార్పు సమాజంలో 'ఊబకాయం' అనే నిశ్శబ్ద మహమ్మారి వేగంగా విస్తరించడానికి ప్రధాన కారణమవుతోంది.

(ఈవార్తలు- స్పెషల్ డెస్క్)

అధిక బరువు అనేది కేవలం సౌందర్యానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, అది ప్రాణాంతక వ్యాధులకు స్వాగత ద్వారం పలుకుతోంది. సాంకేతికత అందుబాటులోకి రావడంతో శారీరక కదలికలు తగ్గిపోయాయి. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల ముందు గడిపే సమయం పెరగడం వల్ల కేలరీలు ఖర్చు కావడం లేదు. దీనికి తోడు ఆహారపు అలవాట్లలో చోటు చేసుకున్న మార్పులు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. జంక్ ఫుడ్, నిల్వ ఉంచిన పదార్థాలు, అధిక చక్కెర కలిగిన పానీయాల వినియోగం విపరీతంగా పెరిగింది. సరైన నిద్ర లేకపోవడం శరీర మెటబాలిజాన్ని తరువాయి 2 వ పేజీలో...

# ఎక్స్‌లో 'ట్రిపుల్‌ఎక్స్' బ్యాన్

### అడల్ట్ వీడియోలు బ్లాక్.. భారత చట్టాలకు తగ్గట్లు నిర్ణయం

ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో అడల్ట్ కంటెంట్, అసభ్యకరమైన వీడియోలు, చిత్రాలను పూర్తిగా బ్లాక్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇటీవల ఎక్స్‌లో కంటెంట్ మోడరేషన్ విషయంలో అనేక మార్పులు తీసుకువస్తామని సంస్థ పేర్కొనగా, భారత ప్రభుత్వ ఐటీ నిబంధనలు, స్థానిక చట్టాలకు అనుగుణంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

న్యూఢిల్లీ:గతంలో ఎక్స్ వేదికగా అడల్ట్ కంటెంట్ విచ్చలవిడిగా లభించేద ని, దీనివల్ల యువత, మైనర్లు పెడదోవ పడుతున్నారని అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలోనే భారత్ నుండి యాక్సెస్ చేసే వినియోగదారుల కు అడల్ట్ సెర్చ్ రిజల్ట్స్, అడల్ట్ మీడియాను నియంత్రించాలని సంస్థ నిర్ణయించినట్టు సమాచారం. భారత ప్రభుత్వం సోషల్ మీడియా సంస్థలపై సెన్సార్‌షిప్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా అశ్లీలతను ప్రేరేపించే కంటెంట్, చట్టవిరుద్ధమైన వీడియోల విషయంలో ప్లాట్‌ఫారమ్‌లు బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. ఒకవేళ ఇటువంటి కంటెంట్‌ను తొలగించడంలో విఫలమైతే, సదరు సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, వాటి 'సేఫ్ హార్బర్' రక్షణను కూడా తొలగించే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎక్స్ తన అల్గారిథమ్‌ను అప్‌డేట్ చేసింది. ఇప్పుడు భారత్‌లోని వినియోగదారులు అడల్ట్ హ్యాష్‌ట్యాగ్‌లు, కీవర్డ్స్ సెర్చ్ చేసినప్పుడు నో రిజల్ట్స్ (ఫలితం లేదు) అని రావడం గానీ, ఆ కంటెంట్ కనిపించకుండా -2 వ పేజీలో...



# కలెక్టర్లు పనిచేస్తలే!

## జిల్లాకేంద్రాల్లో ఉండాల్సిందే

### పద్ధతి మార్చుకోవాల్సిందే.. లేకపోతే కఠిన చర్యలు తప్పవు

### సీఎం రేవంత్ వార్నింగ్.. 99 రోజుల ప్రణాళికపై సమీక్ష

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): పలువురు కలెక్టర్ల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది కలెక్టర్లు.. ఆయా జిల్లా హెడ్ క్వార్టర్లలో నివాసం ఉండటం లేదని, ఈ - 2 వ పేజీలో...

# పవర్ ఫుల్ వాడకం



### నిన్న రాష్ట్ర చరిత్రలో అత్యధిక వినియోగం

### రికార్డు స్థాయిలో 18,139 మెగావాట్ల వాడకం

### అంతరాయం లేకుండా సరఫరా: భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎలాంటి అంతరాయాలు లేకుండా అత్యధిక డిమాండ్ ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా చేసిన ఘనత ఎస్పీడీసీఎల్ నమోదు చేసింది. ఈరోజు ఇప్పటివరకు ఎన్నడూ లేనంత అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైంది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 18,139 మెగావాట్ల విద్యుత్ అవసరం ఏర్పడగా, విద్యుత్ శాఖ అధికారులు విజయవంతంగా సరఫరా నిర్వహించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, సాగు అవసరాలు, గృహ, పారిశ్రామిక వినియోగం పెరగడం వంటి కారణాలతో విద్యుత్ వినియోగం -2 వ పేజీలో...

## రంగంలోకి మోదీ

### గల్ఫ్ దేశాధినేతలకు ఫోన్

### భారతీయుల భద్రతలపై ఆరా



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ అరబ్ దేశాల అధినేతలతో ఫోన్‌లో చర్చలు జరిపారు. గల్ఫ్ దేశాలపై దాడులు జరుగుతున్న వైనంపై ఆందోళన వ్యక్తం చేశారు.

అక్కడి భారతీయుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. ఒమాన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్, కువైత్ యువరాజు షేక్ సబా, ఖతర్ ఎమిర్ షేక్ తమీమ్‌లతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారని అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల బహ్రెయిన్, సౌదీ అరేబియా పాలకులతో కూడా ప్రధాని మోదీ మాట్లాడారు. గల్ఫ్ తరువాయి 2 వ పేజీలో...

# స్వదేశానికి భారతీయులు!

### అబుదాబి నుంచి ఢిల్లీకి ప్రత్యేక ఫ్లైట్లు

### భారత్‌కు నాలుగు విమానాలు రాక

### క్షేమంగా ఇంటికి చేరిన పీవీ సింధు

### దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి

పశ్చిమాసియాలో చోటుచే సుకున్న యుద్ధం నేపథ్యంలో యూఏఈ లో చిక్కుకుపోయిన భారతీయులను తరలించేందుకు భారత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

న్యూఢిల్లీ: ప్రత్యేక విమానాలతో భారతీయులను స్వదేశానికి రప్పిస్తోంది. ఇరాన్ దాడుల వల్ల గగనతలం మూసివేయడంతో గత మూడు రోజులుగా వేలాది మంది ప్రయాణికులు దుబాయ్, అబుదాబి విమానాశ్రయాల్లోనే ఉండిపోయారు. పరిస్థితులు కొంత చక్కబడటంతో -2 వ పేజీలో...



## రాశి ఫలాలు
4.3.2026

మేషం: స్వల్ప అనారోగ్యం సమస్యలుంటాయి. చేపట్టిన పనులు శ్రమతో గాని పూర్తికావు. ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు రావలసిన పదవుల విషయంలో కొంత జాప్యం కలుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటాబయట బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి.

వృషభం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుండి కొంత కీలక సమాచారం అందుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార పరంగా సమస్యలను అధిగమిస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

మిధునం: దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ధన పరమైన విషయాల్లో జాగ్రత్త వహించాలి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం నిరుత్సాహంగా ఉంటుంది.

కర్కాటకం: ఆర్థికంగా మరింత పురోగతి సాధిస్తారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. గృహమున సంతాన వివాహ విషయమై ప్రస్తావన వస్తుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం వరిస్తుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. నిరుద్యోగులకు అధికారుల అండదండలతో నూతన అవకాశాలు లభిస్తాయి.

సింహం: అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. కొన్ని విషయాలలో బంధుమిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం కలుగుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారస్తులకు స్వల్ప లాభాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కన్య: ఇంటాబయట ఒత్తిడులు అధిగమించి ముందుకు సాగుతారు. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. భూ సంబంధిత క్రయ విక్రయాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు. వ్యాపారస్తులకు పెట్టుబడులు సకాలంలో అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి.

తుల: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వాహన వ్యాపారస్తులకు మరింత పురోగతి కలుగుతుంది. ఆత్మీయులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగ పరంగా అధికారులతో చర్చలు అనుకూలిస్తాయి. నిరుద్యోగుల కలలు సాకారం అవుతాయి. కొన్ని వ్యవహారాలలో తెలివిగా వ్యవహరించి అందరి మన్ననలు పొందుతారు.

వృశ్చికం: వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి లభించదు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచన విధానం మార్చుకోవడం మంచిది. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి చేసే ప్రయత్నాలు కొంత మందకొడిగా సాగుతాయి.

ధనస్సు: గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. చేపట్టిన పనులలో శ్రమ మరింత అధికమవుతుంది. రుణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారస్తులకు కష్టానికి తగిన ఫలితం లభించదు. వృత్తి ఉద్యోగాలలో ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఆర్థిక పరిస్థితి కొంత మందగిస్తుంది.

మకరం: గృహ వాతావరణం ఉత్సాహకరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో నూతన లాభాలను అందుకుంటారు. సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వాహన యోగం ఉన్నది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. జీవిత భాగస్వామి సలహాలు కలసివస్తాయి.

కుంభం: వ్యాపార విషయంలో ఆప్తుల సలహాలు తీసుకోవడం మంచిది. సమాజంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. ముఖ్యమైన పనులు సజావుగా సాగుతాయి. మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. వ్యాపారాలలో అవరోధాలు అధిగమిస్తారు. ఉద్యోగమున విధులలో ఆటంకాలు తొలగుతాయి.

మీనం: ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు మార్చుకుంటారు. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. కుటుంబసభ్యుల నుంచి ఆశించిన సహాయం లభించదు. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారమున చిక్కులు పెరుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది.

# లావైపోతున్నారు!

**మొదటి పేజీ తరువాయి**

దెబ్బతీసి బరువు పెరగడానికి కారణమవుతోంది. పని ఒత్తిడి వల్ల కలిగే 'స్ట్రెస్ ఈటింగ్' అధిక కేలరీల వినియోగానికి దారితీస్తోంది.

### భారతదేశంలో ఆందోళనకరంగా ఊబకాయం

భారతదేశంలో ఊబకాయం రేటు ఆందోళనకర స్థాయిలో పెరుగుతోందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే, ఇతర నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో సుమారు 24% మంది మహిళలు, 23% మంది పురుషులు అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నారు. నగర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. పట్టణాల్లో పురుషుల్లో 29.8%, మహిళల్లో 33.2% మంది ఊబకాయులుగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది వరుసగా 19.3%, 19.7% గా ఉంది. 5 ఏళ్లలోపు పిల్లల్లో అధిక బరువు సమస్య 2015-16లో 2.1% ఉండగా, 2019-21 నాటికి 3.4% కి పెరిగింది. 2035 నాటికి భారత్‌లో సుమారు 8.3 కోట్ల మంది పిల్లలు ఊబకాయంతో బాధపడే అవకాశం ఉందని అంచనా. ఊబకాయం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల చికిత్స కోసం భారత్ 2019లోనే సుమారు దాదాపు 2.4 లక్షల కోట్లు ఖర్చు చేసింది. 2060 నాటికి ఇది జీడీపీలో 2.5% కి చేరే అవకాశం ఉంది.

### సోషల్ మీడియా డైట్ డేంజర్

ప్రపంచవ్యాప్తంగా ఊబకాయం పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయి, అవి అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు, జీవనశైలి, ప్రాసెస్డ్ ఫుడ్స్ సులభంగా లభ్యత, పలు పర్యావరణ కారకాలు. సోషల్ మీడియా కూడా ఆహార అలవాట్లు, జీవన శైలిని ప్రభావితం చేయడంలో పాత్ర పోషిస్తోంది. ఇది శరీర బరువుపై బలమైన ప్రభావం చూపుతోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోజు ఏం తినాలి? ఎంత తినాలి? అన్న వ్లాగ్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్ల మీల్ ప్లాన్లు, డైట్ చాలెంజ్‌లు ఫాలో అవ్వడం డేంజర్ అని హెచ్చరిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ యాడ్స్, ఓవర్‌సైజ్డ్ పోర్షన్లు వంటివి మన నిత్య ఆహార శైలిని దెబ్బతీస్తాయని చెప్తున్నారు. ప్రొఫెషనల్ సూపర్ విజన్ లేకుండా, డైట్‌లను అనుసరిస్తే పోషకాహార లోపం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అంటున్నారు. సోషల్ మీడియాల్లో ప్రమోట్ చేసే ఆహార కంటెంట్‌కు వీలైనంత వరకు దూరంగా ఉండాలని,



ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేకుండా ఆహార నియమావళిని ఇష్టమొచ్చినట్లు మార్చవద్దని పేర్కొంటున్నారు. పోషకాహార లోపం తలెత్తితే ఇతర అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని ఢిల్లీకి చెందిన వైద్య నిపుణుడు దానేంద్ర సాహు తెలిపారు. ముఖ్యంగా ప్రజల శరీర తత్వాన్ని బట్టే ఆహారం తీసుకోవాలి గానీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు చెప్పినట్లు చేయవద్దని



# పవర్ ఫుల్ వాడకం

**మొదటి పేజీ తరువాయి**

గణనీయంగా పెరిగిందని అధికారులు తెలిపారు. రికార్డు స్థాయి డిమాండ్ ఉన్నప్పటికీ ఎక్కడా అంతరాయం లేకుండా సరఫరా కొనసాగించగలిగామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవిష్యత్తులో మరింత పెరగనున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ట్రాన్స్‌మిషన్ మరియు డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతం చేసిన ఫలితంగా ఈ రికార్డు డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనగలిగిందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారుల అవసరాలకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ పరిణామం తెలంగాణ విద్యుత్ రంగ సామర్థ్యానికి నిదర్శనమని అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి. కాగా ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఎస్పీడీసీఎల్ చరిత్రలోనే విద్యుత్ వినియోగం సరికొత్త గరిష్ట స్థాయిని చేరిందని పేర్కొన్నారు. మంగళవారం సంస్థ పరిధిలోని 6,441 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదయిందని, రికార్డు స్థాయి డిమాండ్ ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా చేయడంలో ఎక్కడ ఇబ్బంది లేకుండా చేయగలిగామని పేర్కొన్నారు. మంగళవారం సంస్థ చరిత్రలోనే లిఖించదగిన రోజు అని వ్యాఖ్యానించారు. సోమవారం కూడా 6,273 మెగావాట్ల రికార్డును రికార్డును ఎస్పీడీసీఎల్ నమోదు చేసింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుందని, ముందు ముందు మరింత విద్యుత్ డిమాండ్ చోటు చేసుకునే పరిస్థితి లేకపోలేదని స్పష్టం చేశారు. డిమాండ్ ఎంత ఉన్నప్పటికీ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. వేసవి కాలంలో ఎదురయ్యే విద్యుత్ డిమాండ్ ను ఎదుర్కోవడానికి తాము పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ముందస్తు ప్రణాళికలతో, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

# ఎక్స్‌లో 'ట్రిపుల్‌ఎక్స్' బ్యాన్

**మొదటి పేజీ తరువాయి**

హైడ్ చేయడం గానీ కనిపిస్తోంది. ఈ నిర్ణయంపై నెటిజన్ల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలా మంది తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. సోషల్ మీడియాలో పిల్లల భద్రతకు ఇది ఒక కీలక అడుగు అని వారు భావిస్తున్నారు. అయితే, వాక్ స్వాతంత్ర్యం పేరుతో కొందరు దీనిని వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ, దేశ గౌరవానికి, నైతికతకు భంగం కలిగించే కంటెంట్‌ను అడ్డుకోవడం తమ ప్రాధాన్యం అని ఎక్స్ వర్గాలు తెలిపాయి. ఇండియాలోనే కాకుండా, స్థానిక చట్టాలు కఠినంగా ఉన్న ఇతర దేశాల్లో కూడా ఇటువంటి సెన్సార్‌షిప్ అమలు చేయాలని సంస్థ యోచిస్తోంది.

# రంగంలోకి మోదీ

**మొదటి పేజీ తరువాయి**

దేశాలపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఈ దాడులు గల్ఫ్ దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ గల్ఫ్ పౌరులకు అండగా ఉంటుందని కూడా హామీ ఇచ్చారు. జోర్డాన్ రాజుతో కూడా మాట్లాడిన ప్రధాని మోదీ సంఘీభావాన్ని ప్రకటించారు. యూఏఈ అధ్యక్షుడు, ఇజ్రాయెలీ ప్రధానితో కూడా మాట్లాడి అక్కడి పరిస్థితి గురించి ఆరా తీశారు. పశ్చిమాసియా, గల్ఫ్ దేశాల్లో సుమారు 90 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. ఇరాన్‌లో 10 వేల మంది చదువు, ఉద్యోగాల కోసం ఉంటుండగా, ఇజ్రాయెల్‌లో 40 వేల మంది భారతీయులు ఉంటున్నారు.

# స్వదేశానికి భారతీయులు!

**మొదటి పేజీ తరువాయి**

మంగళవారం ఎతిహాద్ ఎయిర్ లైన్స్ అబుదాబి నుంచి ప్రత్యేక విమానాలను నడిపింది. ఇప్పటి వరకు మొత్తం నాలుగు విమానాలు భారత్‌కు చేరుకోగా, ముంబై, బెంగళూరు, కొచ్చి, న్యూఢిల్లీ నగరాల్లో విమానాలు ల్యాండ్ అయ్యాయి. తమ వారు సురక్షితంగా ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

### క్షేమంగా ఇంటికి పీవీ సింధు

దుబాయ్‌లో వారిలో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా ఉన్నారు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు బ్రిటన్ వెళ్తుండగా, దుబాయ్‌లో విమాన సర్వీసులు నిలిచిపోవడంతో సింధు, ఆమె సహాయక సిబ్బంది అక్కడే ఉండిపోయారు. భారత రాయబార కార్యాలయం చొరవతో ఆమె సురక్షిత ప్రాంతానికి వెళ్లారు. తాజాగా పునఃప్రారంభమైన విమాన సర్వీసుల ద్వారా సింధు తన టీమ్‌తో కలిసి సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. తన భద్రత కోసం కృషి చేసిన భారత ప్రభుత్వం, ఎంబసీ అధికారులకు సింధు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ముగ్గురు భారతీయులు మృతి

పశ్చిమాసియా ఘర్షణలో ఇప్పటి వరకూ ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడినట్టు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ మంగళవారం తెలిపింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ సైనిక చర్యలు



తీవ్రమవుతుండటంతో ప్రధానమైన వాణిజ్య మార్గాల్లో అంతరాయం కలుగుతోందని పేర్కొంది. 'వాణిజ్య నౌకలపై నాలుగు దాడి ఘటనలు జరిగినట్టు సమాచారం ఉంది. ముగ్గురు నావికులు మృతి చెందగా, ఒక నావికుడు గాయపడ్డారు. వీరంతా విదేశీ జెండాలున్న నౌకల్లో సేవలందిస్తున్నారు' అని డీజీఎస్ తెలిపింది. కీలక వాణిజ్య మార్గాలైన గల్ఫ్ ఆఫ్ ఒమన్, హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని, ఆయా మార్గాల్లో భద్రతను కచ్చితంగా దృష్టిలో ఉంచుకోవాలని షిప్పింగ్ ఆపరేటర్లకు సూచనలిచ్చామని పేర్కొంది. అనుమానాస్పద కార్యక్రమాలపై వెంటే రిపోర్ట్ చేయాలని కోరినట్టు తెలిపింది. వాణిజ్య నౌకలు, సిబ్బందిపై దాడులు పెరుగుతున్నందున ప్రమాదం ఎక్కువగా ఉన్న రూట్లను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 200కు పైగా నౌకలు ఆ రూట్లకు దూరంగా ఉన్నాయి.

# కలెక్టర్లు పనిచేస్తలే!

**మొదటి పేజీ తరువాయి**

విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు అంటే అదే జిల్లాలో ఉండాలని.. అక్కడి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అలా లేని వారిని సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. పద్ధతి మార్చుకోని కలెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల పాటు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సదస్సులో ప్రభుత్వ ప్రాధాన్యతలపై జిల్లా కలెక్టర్లకు రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. క్షేత్ర స్థాయిలో ప్రతీ అర్హుడికి అందాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కింది స్థాయిలో అధికార యంత్రాంగం పనితీరు మరింత మెరుగుపడాలని.. ప్రభుత్వ పథకాలు, సేవల్లో పారదర్శకత పెరగాలని జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి చేకూరే లబ్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామని.. ఆ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజల అభిప్రాయాలు సేకరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. పంచాయతీల్లో గ్రామ సభల వేదికగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ పైసా లబ్ధిని ప్రజలకు వివరించడం ద్వారా ప్రభుత్వం తరఫున పారదర్శకత పెరుగుతుందని వెల్లడించారు. తెలంగాణ విద్యా వ్యవస్థలో తమ ప్రభుత్వం తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలని రేవంత్ రెడ్డి.. కలెక్టర్లకు వివరించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులను ప్రతీ నెలా ఆయా ఏజెన్సీలకు చెల్లించాలని ఆదేశించారు. ఈ పథకానికి నిధుల కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లకే ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను మరింత పటిష్ఠం చేసేందుకు వాటి సమీపంలో ఉన్న మెడికల్ కాలేజీలతో హాస్పిటల్స్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. రానున్న 99 రోజుల పాటు జిల్లా కలెక్టర్లు అత్యంత అలర్ట్‌గా ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరుతో నిర్వహించనున్న కార్యక్రమాన్ని సక్సెస్ చేసేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అందరు ప్రజాప్రతినిధులను అందులో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ 99 రోజుల పాటు.. జిల్లా కలెక్టర్లు తమ పరిధిని దాటి వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కారించడం కోసమే అధికార యంత్రాంగం పనిచేయాలని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

# యూట్యూబ్‌లో మోదీ రికార్డు

**మొదటి పేజీ తరువాయి**

ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన ఏకైక రాజకీయ నేతగా మోదీ సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. ఇలా ప్రపంచ వేదికపై ఇతర అగ్రదేశాల నేతలకు అందనంత ఎత్తులో ఆయన నిలిచారు. యూట్యూబ్‌లో అత్యధిక ఫాలోయింగ్ ఉన్న నేతల జాబితాను పరిశీలిస్తే.. ప్రధాని మోదీ మొదటి స్థానంలో ఉండగా, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే మోదీకి ఏడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉండటం విశేషం. ఇది ప్రపంచవ్యాప్తంగా మోదీకి ఉన్న క్రేజ్‌ను, ఆయన ప్రసంగాలకు ఉన్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. ప్రధాని మోదీ 2007లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే సాంకేతికత ప్రాధాన్యతను గుర్తించి తన యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. గత 19 ఏళ్లలో ఆయన సుమారు 33,000 కంటే ఎక్కువ వీడియోలను షేర్ చేశారు. ఇందులో ఆయన విదేశీ పర్యటనలు, మన్ కీ బాత్ కార్యక్రమాలు, ఎన్నికల ప్రసంగాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన వీడియోలు ఉన్నాయి. నిరంతరం అప్‌డేట్‌గా ఉంటూ ప్రజలతో నేరుగా మమేకమవ్వడమే ఆయన విజయ రహస్యమని డిజిటల్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. యూట్యూబ్ మాత్రమే కాదు ఇతర సామాజిక మాధ్యమాల్లోనూ మోదీ హవా కొనసాగుతోంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఫాలోవర్ల సంఖ్య 100 మిలియన్ల (10 కోట్లు) మార్కును దాటింది. ఒక రాజకీయ నేతకు సోషల్ మీడియాలో ఇంత భారీ స్థాయిలో ఫాలోయింగ్ ఉండటం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.



# లెక్కా పత్రమేది?

**రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి.. ఖజానా ఖాళీ అంటూనే గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లా?**

**కాంగ్రెస్ నేతల జేబులు నింపుతున్నారా?**

**బీఆర్ఎస్, కాంగ్రెస్ వల్ల అప్పుల తెలంగాణ**

**సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ**



న్యూఢిల్లీ, మార్చి 3 (ఈవార్తలు): తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 420 హామీలిచ్చి అధికారంలోకొచ్చిందని.. హామీలు అమలు చేయాలని అడిగితేనేమో ఖజానాలో లంకె బిందెలకు బదులుగా ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ ప్రజలను అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఖజానా ఖాళీగా ఉందంటున్న రేవంతే.. ఇటీవల ఓ సభలో సోనియా, రాహుల్ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ. వెయ్యికోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారని పేర్కొన్నారు. రేవంత్ మాటలను బట్టి 'రాష్ట్ర ఖజానా నిల్ – కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్' అన్నట్టుగా అనిపిస్తోందని దుయ్యబట్టారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ ఆర్థిక స్థితిని పదేళ్ల పాలన ద్వారా బీఆర్ఎస్ దెబ్బతీసిందని, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం గత 27 నెలల్లోనే అత్యంత దయనీయ స్థితికి చేర్చిందని విమర్శించారు. ఆర్థికంగా తెలంగాణ దుస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణం అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల కోసం కూడా కేంద్రం అందిస్తున్న వడ్డీలేని రుణాలపై రేవంత్ ప్రభుత్వం ఆధారపడుతుండటం చూస్తుంటే ఆర్థికంగా తెలంగాణ ఎంత దుస్థితిలో ఉందో అర్థమవుతోందని చెప్పారు. చివరికి వడ్డీల చెల్లింపులకు, ఉద్యోగుల జీతాలకు, రైతు భరోసా నిధులకు, సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర సర్కారు మళ్లీ మళ్లీ అప్పులు చేస్తోందన్నారు. రుణం తీసుకోకుండా ఒక్క పనికూడా చేయలేని దుస్థితికి తెలంగాణ చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉంద మార్చి 16న ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఒక పూర్తిస్థాయి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని లేఖలో కిషన్‌రెడ్డి కోరారు. 2014 నుంచి తెలంగాణకు ప్రధాని మోదీ ఎంతో చేశారని, 12 ఏళ్లలో దాదాపు రూ.12లక్షల కోట్లు కేటాయించారని చెప్పారు. ఎస్ఏఎస్సీఐ (సాస్కి) పథకం కింది రాష్ట్రానికి గత ఐదేళ్లలో రూ.10వేలకోట్లకు పైగా వడ్డీలేని రుణాలు అందించినట్లు చెప్పారు. ఈ నిధులతో రోడ్ల విస్తరణ నుంచి యంగ్ ఇండియా పాఠశాలల వరకూ మేలు జరిగిందన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్లు, గోదావరి–మూసీ అనుసంధానం, మూసీ నది సుందరీకరణ తదితర ప్రాజెక్టులకు సాస్కి నిధులు ఖర్చు చేశారని వివరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో దేశంలో పెట్రో ఉత్పత్తుల లభ్యతపై ఆందోళన చెందాల్సిన పని లేదని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'మనదేశ అవసరాలకు అనుగుణంగా పెట్రోఉత్పత్తుల లభ్యత ఉంది. అవసరమైన మేర దిగుమతి చేసుకోవడానికి కూడా ఇబ్బందుల్లేవు. మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా దేశంలో పెట్రో ఉత్పత్తులకు కొరత తలెత్తే ప్రసక్తేలేదు' అని ఒక ప్రకటనలో ఆయన స్పష్టంచేశారు. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం, అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఎగుమతులు, దిగుమతులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కేంద్రం.. వివిధ మంత్రిత్వశాఖల బృందాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు.



## 'నైని'పై నాన్చుతున్నారు!

**బొగ్గు టెండర్లపై నిజాలు నిగ్గుతేల్చని కేంద్రం**

కరీంనగర్, మార్చి 3 (ఈవార్తలు) : దేశవ్యాప్తంగా దుమారం రేపిన నైని బొగ్గు గని టెండర్ల అక్రమాలను నిగ్గు తేల్చడంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం చూపుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నైని టెండర్లలో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై ఆగమేఘాల మీద సాంకేతిక కమిటీ వేయడంతోపాటు విచారణ జరిపి మూడు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన కేంద్రం ఆ తర్వాత జోరు చూపడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విచారణ జరిపి 30 రోజులు దాటినా నేటికీ నివేదికను బహిర్గతం చేయకపోవడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. నైని టెండర్ల వ్యవహారంలో వెలుగు చూసిన అంశాలపై కమిటీ ఇచ్చిన నివేదిక కాపీ ఇవ్వాలంటూ టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సమాచార చట్టం కింద కేంద్రాన్ని అడిగితే ఇంకా విచారణలో ఉన్నదని, ఇప్పుడే నివేదిక కాపీ ఇవ్వడం సాధ్యపడదని చేతులు దులుపుకొనే ప్రయత్నం చేసిన తీరుపై సందేహాలు రేకెత్తుతున్నాయి.

# అక్రమ వెంచర్లు హైడ్రాకు కనిపించవా?

వీటికి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్: కవిత



రంగారెడ్డి, మార్చి 3 (ఈవార్తలు): హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి భారీ రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్మిస్తున్నారని, వాటిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. అక్కడి వెంచర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా ప్రజల నివాసాలు తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేదల ఇళ్లు కూల్చివేస్తున్న హైడ్రాకు ఈ అక్రమ వెంచర్ కనిపించడం లేదా అని నిలదీశారు. కుత్బుల్లాపూర్, ఖమ్మం వెలుగుమట్ల, మూసీ నది పరిసరాల్లో అన్నీ పేదల ఇళ్లనే కూల్చుతున్నారని ఆరోపించారు. జనం బాటలో భాగంగా అక్రమ ఇళ్ల నిర్మాణాలను హైడ్రా దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. పేదల ఇళ్లు కూల్చవద్దని కూడా విజ్ఞప్తి చేశామని అన్నారు. మూసీ నది పక్కన ఉన్న పేదల ఇళ్లను కూల్చిన హైడ్రా అధినేత రంగనాథ్ కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూసీ నదిలోనే నిర్మిస్తున్న అక్రమ వెంచర్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. అవసరమైతే రంగనాథ్ బుల్డోజర్ తీసుకువచ్చేవరకు ఇక్కడే నిరసన చేపడతామని హెచ్చరించారు. ఖమ్మం కూడా వెళ్లి పేదల తరఫున కొట్లాడుతామని అన్నారు. 20 ఏళ్ల క్రితం కట్టిన మధ్యతరగతి వారు కొనుగోలు చేసిన అపార్టుమెంట్‌ను కూలగొట్టాలని చెబుతున్నారని, కానీ ధనికుల నిర్మాణాలకు మాత్రం అడ్డంకులు లేవని మండిపడ్డారు. ఈ అక్రమ భవనాలకు బీఆర్ఎస్ హయాంలో అనుమతులు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల పాటు ఈ నిర్మాణాలు నిలిచిపోయాయని అన్నారు. ఆ తర్వాత లంచాలు తీసుకుని నిర్మాణాలకు తిరిగి పర్మిషన్ ఇచ్చారని ఆరోపించారు. న్యాయం అందరికీ ఒకేలా ఉండాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. కచ్చితంగా మూసీని, తెలంగాణ వనరులను పరిరక్షించుకుంటామని కవిత అన్నారు.

కవిత అరెస్టు

కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అంటూ ఆమె నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు తాము ఆందోళన విరమించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లో ఎక్కిస్తుండగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. అక్రమ వెంచర్లను కూల్చడానికి హైడ్రా, రంగనాథ్ రావాలని వారు డిమాండ్ చేశారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది.

# విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్టు చేయూత



మేడ్చల్ మల్కాజిగిరి, మార్చి 3 (ఈవార్తలు): ఉన్నత విద్య అభ్యసిస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా చేయూతనందిం చడం అభినందనీయమని సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. మంగళవారం ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 7 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఆయన నివాసంలో చెక్కులను అందజేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే మొత్తం 122 మంది వైద్య విద్యార్థులకు విద్యా ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. ఇది కేవలం దానంగా కాకుండా భవిష్యత్ ఆరోగ్య వ్యవస్థలో పెట్టుబడిగా భావించాల్సిన అంశమని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చే ప్రతిభావంతమైన యువతను ప్రోత్సహిస్తూ, విద్య ద్వారా సాధికారత కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రంలో ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల స్థాపించారని, దీంతో వైట్‌కోట్ విప్లవం సాకారమైందని, దీని ద్వారా వైద్య విద్య అవకాశాలు విస్తరించి ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతమయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, నాయకులు పిల్లి నాగరాజు, మహేష్‌గౌడ్, వంజరి ప్రవీణ్ కరిపే, బోసాని పవన్‌కుమార్, దయాకర్‌రెడ్డి, శ్రవణ్, రఘువరణ్, నాని, రాజేష్‌గౌడ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం

**గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వరుసలో ఏర్పాటు**


**పనులు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన పనులను ఇప్పటికే ప్రారంభించింది. అసెంబ్లీలోని మండలి భవనం పక్కన ఉన్న గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వరుసలోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా పెట్టనున్నారు. గాంధీ విగ్రహానికి ఎడమవైపు 8 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహం ఉండగా, అంతే ఎత్తుతో గాంధీ విగ్రహానికి కుడివైపున తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం అక్కడ కాంక్రీట్ బేస్‌మెంట్‌ను నిర్మించారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే మార్చి 16న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. విగ్రహం ఖర్చు రూ.34 లక్షలు, ఫౌండేషన్, ఇతర సివిల్ పనులకు మరో రూ.12 లక్షలు కలిపి రూ.46 లక్షలను వెచ్చిస్తున్నారు. అలాగే పునరుద్ధరించిన శాసనమండలి భవనంలోనే ఈసారి మండలి సమావేశాలను కూడా నిర్వహించనున్నారు. ఈ మేరకు మండ లి భవనం పునరుద్ధరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మార్చి 8న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా మండలి భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలి భవనం పునరుద్ధరణ కోసం

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య



యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చి 3 (ఈవార్తలు): గొల్లెగూడెంలో విషాదం చోటుచేసుకుంది. ఓ మహిళ తన కూతురు(10 నెలలు), కుమారుడి(2)ని చంపి అనంతరం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భార్యాభర్తల మధ్య గొడవలే ఆత్మహత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. భర్త రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. మరో ఘటనలో నిరుపయోగంగా ఉన్న మిల్లులో ఉరేసుకుని వలస కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నేరేడుచర్ల పట్టణంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని కోటక్ జిల్లాకు చెందిన శ్రీధర్(25) నేరేడుచర్ల పట్టణంలో నిరుపయోగంగా ఉన్న చాణక్య రైస్ మిల్లు పక్కనే ఉన్న ఒడిశా దాబాకు అప్పుడప్పుడు వచ్చి కొన్నిరోజులు అక్కడే పనిచేసి తిరిగి సొంతూరుకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో గత నెల 25న దాబాకు వచ్చిన శ్రీధర్ మూడురోజులు పనిచేసి తిరిగి ఊరికి వెళ్తున్నానంటూ దాబా యాజమాని వద్ద రూ.3వేలు తీసుకుని వెళ్లాడు. అయితే సోమవారం చాణక్య రైస్ మిల్లు నుంచి దుర్వాసన వస్తుండడంతో పరిసర ప్రాంతాల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మిల్లులోకి వెళ్లి పరిశీలించగా శ్రీధర్ ఉరేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు, మూడు రోజుల క్రితమే శ్రీధర్ ఉరేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## రేపు టెన్త్ హాల్‌టికెట్ల విడుదల

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు) : పదో తరగతి వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు గురువారం విడుదల కానున్నాయి. ఈ సారి మూడు రకాలుగా హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయి. వీటిని బోర్డు వెబ్‌సైట్‌లో విడుదల చేయడంతోపాటు తల్లిదండ్రుల వాట్సాప్‌కు సైతం పంపిస్తారు. అదే తేదీలోపు ప్రింటెడ్ హాల్‌టికెట్లను సైతం స్కూళ్లకు చేరవేస్తారు. హాల్‌టికెట్ల కోసం దష్ట్రిజూం://ఎంవ్.వశ్రీఖఅస్త్రుఖఖ.స్త్రశీజ.అఅగ వెబ్‌సైట్‌నూ సంప్రదించవచ్చు. లేదంటే వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కుదరని పక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించి పొందవచ్చు. విద్యార్థులు ఏ హాల్‌టికెట్‌తో వచ్చినా పరీక్షలకు అనుమతిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరుగనున్న విషయం తెలిసిందే. 5,28,248 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

## రాజ్యసభకు నలుగురు బీసీ ఆశావహులు: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): తెలంగాణ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమర్థులైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారని, ఒకటి లేదా రెండు స్థానాల కేటాయింపుపై రేపు స్పష్టత వస్తుందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ కేవలం కార్పొరేట్ శక్తులకే పెద్దల సభలో అవకాశం ఇచ్చిందని, తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని ఆయన విమర్శించారు. అలాగే, మార్చి నెలలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని వెల్లడించారు. మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ... దశాబ్దాలుగా సిద్ధాంతం కోసం పనిచేస్తున్న వారి పట్ల తమకు గౌరవం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధపడి, మావోయిస్టులతో చర్చలకు నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ, లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు.

## జగన్‌తో భట్టి భేటీ

**కుమారుడి వివాహానికి ఆహ్వానం**

తాడేపల్లి, మార్చి 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు విక్రమాదిత్య వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జగన్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వధూవరులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. కాగా, తన కుమారుడి వివాహానికి రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తూ భట్టివిక్రమార్క ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## సైబర్ క్రైమ్ పోలీసులకు రేణుదేశాయ్ ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): ప్రముఖ నటి రేణుదేశాయ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. సోషల్ మీడియాలో కొంతమంది అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా కొంతమంది నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో పరిధి దాటి ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా తనపై కామెంట్లు పెడుతున్న నాలుగు సోషల్ మీడియా అకౌంట్లపై ఆధారాలతో సహా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రేణుదేశాయ్ మహిళలు, చిన్నారులు, మూగజీవాల రక్షణపై తన అభిప్రాయాలను సామాజిక మాధ్యమాల్లో నిత్యం పంచుకుంటున్నారు. ముఖ్యంగా ఇటీవల శునకాల గురించి ఆమె కొన్నిరోజుల క్రితం పెట్టిన ప్రెస్‌మీట్‌పై పలువురు నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వీధి కుక్కల దాడులపై తాను చేసిన కొన్ని వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు నెటిజన్లు హద్దుమీరారని ఆమె ఆరోపించారు. ఈ క్రమంలో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

## స్కానింగ్ సెంటర్‌లో X. .బాలిక ప్రసవంపై విచారణ

నాగర్‌కర్నూల్, మార్చి 3 (ఈవార్తలు): నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని స్కానింగ్ సెంటర్ బాత్రూమ్‌లో బాలిక ప్రసవించిన ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16) ఓ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 2న కడుపునొప్పితో బాధపడుతుండగా.. ఆమె తల్లి నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లింది. బాలికను పరీక్షించిన డాక్టర్ సూచన మేరకు స్కానింగ్ సెంటర్‌కు వెళ్లారు. ఆ సమయంలో నొప్పులు రావడంతో అక్కడే ఉన్న బాత్రూమ్‌లోకి తల్లి తీసుకెళ్లింది. లోపలికి వెళ్లగానే బాలిక మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువును అక్కడి చెత్తబుట్టలో పడే సేందుకు తల్లీబిడ్డలు యత్నించగా నిర్వాహకుల సమాచారంతో పోలీసులకు చేరుకొని ఇద్దరిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై జీసీడీవో శోభారాణి మంగళవారం బాలిక చదువున్న కళాశాలకు వెళ్లి ఆరాతీశారు. గర్భం రావడానికి బాధ్యుడైన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

## రైల్వే ట్రాక్ నిర్వహణలో అక్రమాలు!

హనుమకొండ, మార్చి 3 (ఈవార్తలు): హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైల్వే ట్రాక్ నిర్వహణ పనుల్లో దినసరి లేబర్‌ను కుదించి సిబ్బందితో పనులు చేయించేందుకు కాంట్రాక్టు సంస్థలకు రైల్వే అధికారులు సహకరించడంపై సీబీఐ ఇటీవల కేసు నమోదు చేసింది. రైల్వే సబ్‌డివిజన్ పరిధిలో 2020–24 రైల్వే ట్రాక్ నిర్వహణ పనులను సంధ్య కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వేరే కాంట్రాక్టర్లతో కు మ్మకై తక్కువకు టెండర్‌ను దక్కించుకున్నది. సదరు కంపెనీ తగినంత మంది లేబర్లను పనిలో పెట్టకోకుండా, రైల్వే అధికారులను మచ్చిక చేసుకుని సిబ్బందితో ట్రాక్ పనులను చేయించి బిల్లులు తీసుకుంది. సదరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ తక్కువకు టెండర్ దక్కించుకుని పనులు ఎలా చేపడుతున్నదని ఇటీవల సీబీఐ విచారణ చేపట్టింది. ఈ విచారణలో సంధ్య కన్‌స్ట్రక్షన్ కంపెనీ లేబర్‌ను కు దించి ట్రాక్ నిర్వహణ పనులు చేపట్టడం, రైల్వే ఇంజినీరింగ్ కార్మికుల ను పనిలో వాడుకోవడం, రైల్వే అధికారులు సహకరించినట్టు నిర్ధారణకు వచ్చారు. ట్రాక్ పనుల్లో సిబ్బందిని తగ్గించడం, ఆ పనికి సరిపడా లేబర్ కు ఇవ్వాల్సిన ఈపీఎఫ్ తదితర బెనిఫిట్స్ ఇవ్వకుండా నకిలీ రిజిస్టర్‌ను సృష్టించినట్టు తేలింది. కాంట్రాక్టు సంస్థతో రైల్వే అధికారులు కుమ్మక్కైనట్టు గుర్తించి కాంట్రాక్టర్‌తో పాటు రైల్వే అధికారులపై సీబీఐ ఫిబ్రవరి 16న హైదరాబాద్‌లో కేసులు నమో దు చేసినట్టు సమాచారం.

## 'నైని'పై నాన్చుతున్నారు!

**బొగ్గు టెండర్లపై నిజాలు నిగ్గుతేల్చని కేంద్రం**

కరీంనగర్, మార్చి 3 (ఈవార్తలు) : దేశవ్యాప్తంగా దుమారం రేపిన నైని బొగ్గు గని టెండర్ల అక్రమాలను నిగ్గు తేల్చడంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం చూపుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నైని టెండర్లలో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై ఆగమేఘాల మీద సాంకేతిక కమిటీ వేయడంతోపాటు విచారణ జరిపి మూడు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన కేంద్రం ఆ తర్వాత జోరు చూపడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విచారణ జరిపి 30 రోజులు దాటినా నేటికీ నివేదికను బహిర్గతం చేయకపోవడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. నైని టెండర్ల వ్యవహారంలో వెలుగు చూసిన అంశాలపై కమిటీ ఇచ్చిన నివేదిక కాపీ ఇవ్వాలంటూ టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సమాచార చట్టం కింద కేంద్రాన్ని అడిగితే ఇంకా విచారణలో ఉన్నదని, ఇప్పుడే నివేదిక కాపీ ఇవ్వడం సాధ్యపడదని చేతులు దులుపుకొనే ప్రయత్నం చేసిన తీరుపై సందేహాలు రేకెత్తుతున్నాయి.

## ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. పంతులు చెరువు లో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు సాగర్ ( 17 ), అభిషేక్ ( 17 ) నీటిలో మునిగి దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు.

ఈవార్తలు



## అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ వెలుగులు

**ఉచిత కనెక్షన్లతో ఎన్పీడీసీఎల్ సేవలు.. ఎస్ఈ బొంకూరి సుదర్శనం వెల్లడి**



జగిత్యాల టౌన్, మార్చి 3 (ఈవార్తలు): పిల్లల భవిష్యత్తుకు వెలుగులు నింపే అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంలో ఎన్పీడీసీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని ఎస్ఈ బొంకూరి సుదర్శనం తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ లేని అంగన్వాడీ కేంద్రాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నామని వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేని కేంద్రాలను గుర్తించి, కనెక్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. విద్యుత్ కనెక్షన్లు, అంతర్గత వైరింగ్, ఇతర సదుపాయాలు వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయని, ఇది పూర్తిగా ఉచితమని చెప్పారు. చిన్నారుల కోసం నిర్వహించే ప్రీ-స్కూల్ కార్యకలాపాలు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య సేవలు సజావుగా సాగేందుకు విద్యుత్ సౌకర్యం ఎంతోగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు తదితర పరికరాలు సక్రమంగా పనిచేయడంతో పిల్లలు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించగలుగుతారని ఆయన పేర్కొన్నారు.

## కోలరాజు స్మారక సుప్రీం సూపర్ డాడీ పురస్కారం



హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): వసుంధర విజ్ఞాన వికాస మండలి 33 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కోలరాజు స్మారక సుప్రీం సూపర్ డాడీ పురస్కారాలకు దరఖాస్తులు కోరుతున్నామని మండలి తెలిపింది. ఈ పురస్కారానికి గాను ఆడపిల్లల తండ్రులు మాత్రమే అర్హులు. ఆడపిల్లల తండ్రి అయి ఉండి వారి ఉన్నతికి కృషి చేయడంతో పాటు వారి సాధికారతకు కృషి చేస్తూ వారిని అత్యున్నత పౌరురాలిగా తీర్చిదిద్దిన తండ్రులకు ఈ పురస్కారం అందజేస్తామని వ్యవస్థాపకుడు మధుకర్ వెల్లడించారు. వివరాలను మధుకర్, వ్యవస్థాపకులు, వసుంధర విజ్ఞాన వికాస మండలి, ఇ.నెం.13-3/3/6/2ఈర, అవంతినగర్ తోట, మోతీనగర్, హైదరాబాద్ 500018కు పోస్టులో పంపగలరు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 8096677409కు సంప్రదించాలని పేర్కొన్నారు.

## బీజేవైఎంలో పెనుకొండ వాసికి కీలక పదవి

**సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎం హరీశ్**



పెనుకొండ, మార్చి 3 (ఈవార్తలు): భారతీయ జనతా పార్టీకి లో కీలక విభాగం అయిన యువ మోర్చాకి శ్రీ సత్య సాయి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎం హరీశ్‌కు పదవి దక్కింది. పార్టీ కీలక బాధ్యతలు అప్పగించడంపై ఆయన స్పందిస్తూ.. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్, భారతీయ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సునీల్ రెడ్డి, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, కేంద్ర, రాష్ట్ర, జిల్లా, మండల, పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువతలో జాతీయ భావన, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.



## బీఆర్ నాయుడుకు హైదరాబాద్ కోర్టు ఊరట

హైదరాబాద్, మార్చి 3 (ఈవార్తలు): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు హైదరాబాద్ కోర్టులో భారీ ఊరట లభించింది. తనపై జరుగుతున్న విషప్రచారాన్ని నిలిపివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం గ్యాగ్ ఆర్డర్ జారీ చేసింది. ఈ విషయాన్ని బీఆర్ నాయుడు స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తనపై ఎలాంటి ఆధారరహిత, దుష్ప్రచార కథనాలను ప్రసారం చేయకూడదని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలను కోర్టు స్పష్టంగా ఆదేశించిందని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రచురితమైన లేదా ప్రసారమైన కథనాలను తక్షణమే తొలగించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నట్లు వివరించారు. ఇదే సమయంలో గూగుల్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సైతం సంబంధిత కంటెంట్‌ను తమ సైట్ల నుంచి తొలగించాలని కోర్టు ఆదేశించినట్లు నాయుడు పేర్కొన్నారు. తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే ఏఐ, మార్ఫింగ్ వీడియోల ద్వారా తనపై దుష్ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. "సత్యం చివరకు గెలుస్తుంది. ధర్మం వైపు నిలబడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.



## జోగి రమేశ్‌కు బుగ్గన పరామర్శ

**కూటమి ప్రభుత్వంపై విమర్శలు**

విజయవాడ, మార్చి 3 (ఈవార్తలు): ఏపీలో రాజకీయ కక్ష సాధింపులు పరాకాష్ఠకు చేరాయని వైసీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జోగి రమేశ్ నివాసానికి వెళ్లిన బుగ్గన ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్ ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాంబులతో దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాకుండా, దాడులు చేసే వారికి ఎస్కార్ట్ ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేక నేరస్థులకు రక్షణ కల్పిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ దాడులను మహిళలు ముందుండి నడిపించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నడూ చూడని కొత్త సంస్కృతి అని ఆయన అన్నారు. మహిళలతో అసభ్యకరంగా మాట్లాడించడం, దాడులు చేయించడం వెనుక పెద్దల 'కోచింగ్' ఉందని ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసినప్పటికీ, ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని బుగ్గన తప్పుబట్టారు. బాధితులపైనే కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలి కానీ, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడానికి కాదని అన్నారు.

## క్రియేటర్ల శ్రమను దోచుకుంటున్నారు

**విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు**

విజయవాడ, మార్చి 3 (ఈవార్తలు): సోషల్ మీడియా వేదికలపై రాత్రింబవళ్లు శ్రమించి కంటెంట్‌ను సృష్టిస్తున్న భారతీయ క్రియేటర్లకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారతీయుల ప్రతిభను తక్కువ ధరకు వాడుకుంటూ, ప్రకటనల ద్వారా వచ్చే భారీ ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకుంటున్నాయని మండిపడ్డారు. యూట్యూబ్ వంటి సంస్థలు ప్రకటనల ఆదాయంలో 55 శాతం క్రియేటర్లకు ఇస్తుండగా, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు క్రియేటర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విదేశీ సంస్థలు తమ ధోరణిని మార్చుకోని పక్షంలో, భారతదేశానికే సొంతంగా ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఉండాలని ఆయన ప్రతిపాదించారు. 'భారత్ టాక్సీ' లాంటి స్వదేశీ ప్రత్యామ్నాయాల మాదిరి, ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉంటే మన దేశ సంపద విదేశాలకు పోకుండా ఉండటమే కాకుండా, క్రియేటర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని విజయసాయి రెడ్డి కోరారు. గతంలో అశ్వినీ వైష్ణవ్ క్రియేటర్ల పక్షాన మాట్లాడిన విషయాన్ని గుర్తుచేస్తూ, వారి ఆర్థిక భద్రత, హక్కుల కోసం కఠినమైన చట్టబద్ధ నిబంధనలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ క్రియేటర్ల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వ రంగంలో లేదా స్వదేశీ భాగస్వామ్యంతో కొత్త ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు.

# హామీలు అడిగితే అరెస్టులా?

**చంద్రబాబుపై వైఎస్ జగన్ ఫైర్**



తాడేపల్లి, మార్చి 3 (ఈవార్తలు): అంగన్ వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టుపై ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ఫైరయ్యారు. ఇచ్చిన హామీలను అమలు చేయమంటే అరెస్టు చేస్తారా? అంటూ ప్రశ్నించారు. వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మీరు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గట్టిగా అడగడం తప్పేలా అవుతుందని నిలదీశారు. రెండేళు అవుతున్నా.. ఆ హామీలకు దిక్కూ, మొక్కూ లేదని నిలదీయడం నేరం అవుతుందా? అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై మీ దమనకాండ అత్యంత హేయమని ట్వీట్ చేశారు. మహిళలని చూడకుండా వారిపై లాఠీఛార్జీ చేస్తూ, పోలీసుల చేత బలప్రయోగంచేస్తూ, ఎక్కడికక్కడ వారిని నిర్బంధించి, వారికి కనీస సౌకర్యాలు కూడా లేకుండా చేసి అత్యంత అమానవీయంగా వ్యవహరించారని వైఎస్ జగన్ మండిపడ్డారు. వాళ్లు ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, ఈ ఉదయం చర్చలకు పిలుస్తామనిచెప్పి, ముందు రోజు రాత్రే నిరసన శిబిరాలకు కరెంటు తీసివేసి, కంచెలు వేసి, కనీసం ఆహారం, తాగునీళ్లు అందకుండా చేయడం దారుణం కాదా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఏరుదాటాక తెప్పతగలేసే మీ ధోరణిని, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లు ఎగ్గొట్టి పచ్చి మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఒక్క అంగన్‌వాడీలకే కాదు, రైతులకు, విద్యార్థులకు, మహిళలకు, ఉద్యోగులు సహా వివిధ వర్గాల వారికి మీరు చేస్తున్న అన్యాయాలు, వెన్నుపోట్లు శిశుపాలుడి పాపాల్లా పెరుగుతూనే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా మీరు మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. చంద్రబాబూ.. మీరు తక్షణం అంగన్‌వాడీలు, వర్కర్లకు క్షమాపణలు చెప్పాలని.. వారికిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నట్లు ట్విటర్ వేదికగా వైఎస్ జగన్ ప్రశ్నించారు.

# పంచాయతీలకు ఏపీ సర్కారు అండ

**చంద్రబాబుకు పవన్ ధన్యవాదాలు**



అమరావతి, మార్చి 3 (ఈవార్తలు): ఏపీ ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ, పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నాడు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జరిగిన ఈ భేటీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. ప్రధానంగా జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, గ్రామీణ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. నియోజకవర్గాల వారీగా జరిగిన నిధుల కేటాయింపులపై కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు సీఎం పలు విలువైన సూచనలు చేశారని పవన్ తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన 'మేజిక్ డ్రెయిన్ల' పనితీరును పవన్ ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్లను నిర్మించడం ద్వారా పారిశుధ్య నిర్వహణను మరింత పకడ్బందీగా అమలు చేయవచ్చని వివరించారు. అలాగే, సాగునీటి పారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను వేసవిలోనే పూర్తి చేయాలని, దీనివల్ల పంటలు వేసే సమయానికి రైతులకు ఇబ్బందులు ఉండవని కోరారు. అటవీ శాఖ చేపట్టిన 'హనుమాన్ ప్రాజెక్ట్' వివరాలను కూడా పవన్ ముఖ్యమంత్రికి వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా సీఎం సూచనలను పాటిస్తూ ముందుకు సాగుతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# బీఆర్ నాయుడు మూతి పగలగొట్టాలి



నగరి, మార్చి 3 (ఈవార్తలు): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీటీడీలో చిన్న పదవి వచ్చినా పూర్వజన్మ సుకృతంగా భావిస్తారని.. అలాంటిది ఏకంగా టీటీడీ చైర్మన్ పదవి వస్తే.. బీఆర్ నాయుడు ఆ పదవికి తగినట్లుగా హుందాగా నడుచుకున్నారా అని రోజా ప్రశ్నించారు. టీటీడీ చైర్మన్‌గా హుందాతనంతో ఎప్పుడైనా వ్యవహరించారా అని ప్రశ్నించారు. టీటీడీ చైర్మన్ హోదాలో హుందాగా మాట్లాడాలని, రాజకీయాలకు దూరంగా ఉండాలనే ఇంగితం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీటీడీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత కొండ మీద ఎన్నో అపశ్రుతులు చోటుచేసుకున్నాయని రోజా ఆరోపించారు. గోవుల మృతి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. 'హిందువులు అందరూ భగవద్గీతలో ప్రతిరోజూ ఒక పేజీ అయినా చదవాలని పెద్దలు చెప్తారు. భగవద్గీత సారాంశాన్ని అర్థం చేసుకుని జీవితంలో ఆ విధంగా నడుచుకోవాలని చెప్తారు. కానీ బీఆర్ నాయుడు మాత్రం.. భగవద్గీతలో ఏముంది, చెత్త తప్ప అని అంటారు.. మూతి మీద నాలుగు పటపటా వేయాలనిపించింది. ఆయనకు భగవద్గీత సారాంశం ఏం తెలుసు? అందుకే అలాంటి మాటలు మాట్లాడారు. బీఆర్ నాయుడు వ్యాఖ్యల మీద హిందువులు తిరగబడాలి. బీజేపీ, హిందూ సంఘాలు, ధార్మిక సంస్థలు బీఆర్ నాయుడు వ్యాఖ్యలపై స్పందించి, బుద్ధి చెప్పాలి. హిందూధర్మం మీద నమ్మకం లేని వ్యక్తికి టీటీడీ చైర్మన్‌గా కొనసాగే అర్హత లేదు. వెంటనే ఆయనతో రాజీనామా చేయించాలి' అని రోజా డిమాండ్ చేశారు.

### తిరుపతిలో వైసీపీ ఆందోళన

మరోవైపు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిరుపతిలో ఆందోళనకు దిగాయి. మంగళవారం ఉదయం అలిపిరి గరుడ కూడలి వద్ద వైసీపీ కార్యకర్తలు, నేతలు బీఆర్ నాయుడుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆధ్యాత్మిక నిలయమైన తిరుమలను బీఆర్ నాయుడు భ్రష్టుపట్టిస్తున్నారని ఆరోపించారు. సనాతన ధర్మ పరిరక్షణలో ముందు ఉంటాననే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి బీఆర్ నాయుడు మీద చర్యలు తీసుకోవాలని.. వెంటనే ఆయనను టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మరోవైపు 30 యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో నిరసనకు దిగిన వైసీపీ నేతలపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఇరాన్‌పై దాడులను ఖండించకపోవడం దారుణం: బీవీ రాఘవులు



విజయవాడ, మార్చి 3 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. చర్చల పేరుతో అకస్మాత్తుగా దాడులు చేయడం అనైతికమని, ట్రంప్ హయాంలో అమెరికా అనుసరిస్తున్న మొండి వైఖరిని ఆయన తప్పుబట్టారు. నెతన్యాహుతో భేటీల నేపథ్యంలో భారత్ ఈ దాడులకు పరోక్ష మద్దతు ఇస్తున్నట్లు కనిపిస్తోందని రాఘవులు ఆరోపించారు. గల్ఫ్ దేశాల్లోని కోట్లాది మంది భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారి భద్రతపై కేంద్రం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రష్యా చమురు కొనుగోళ్లు, అమెరికా సుంకాల విషయంలో మోదీ ప్రభుత్వం విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గుతోందని విమర్శించారు. వీటికి నిరసనగా మార్చి 24న ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు రాఘవులు ప్రకటించారు.

## వన్య ప్రాణి సంరక్షణకు 'హనుమాన్'

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

అమరావతి, మార్చి 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా 'హనుమాన్ ప్రాజెక్ట్' తీసుకొచ్చామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ హనుమాన్ ప్రాజెక్ట్ కోసం పూర్తి సాంకేతికతతో కూడిన 100 వాహనాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో 93 ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలు కాగా, మరో 7 వాహనాలు వన్యప్రాణుల సంరక్షణతో పాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అవసరమైన అంబులెన్స్‌లు ఉన్నాయని స్పష్టం చేశారు. వీటికి అనుసంధానంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, బైర్లుటిల్లో నాలుగు వైల్డ్ లైఫ్ రెస్క్యూ అండ్ ట్రీట్మెంట్ సెంటర్లు, 19 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రతి వాహనంలో అటవీ రేంజ్ ఆఫీసర్, జంతు వైద్య సిబ్బంది, ట్రైబల్ హెల్పర్స్ (గిరిజన), పారా వెటరేనియన్స్ తో కూడిన పూర్తి స్థాయి వ్యవస్థ ఉంటుందని తెలిపారు. గ్రామస్థాయిలో వన్య జీవి రక్షక్ (వజ్ర)లను అటవీ శాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. 'వీరికి రెస్క్యూ కిట్లు అందిస్తున్నాం. గ్రామ స్థాయిలో పాములు, ఇతర జంతువుల నుంచి ఎదురయ్యే సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే విధంగా వారికి శిక్షణ ఇచ్చాం' అని హనుమాన్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

## 100 కోట్ల ఆలయ భూమి కబ్జా: గుడివాడ అమర్నాథ్

అనకాపల్లి, మార్చి 3 (ఈవార్తలు): సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేసే నేతలు, కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూములు కబ్జా అవుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న కన్యకాపరమేశ్వరి దేవాలయానికి చెందిన భూములు అక్రమంగా బదలాయించారంటూ ఆయన మండిపడ్డారు. వందేళ్ల క్రితం దాతలు కన్యకాపరమేశ్వరి ఆలయానికి 2 ఎకరాల 49 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారని... అందులో ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ కోసం కొంత తీసుకోగా, మిగిలిన 1 ఎకరా 11 సెంట్ల స్థలం ప్రస్తుతం ఉందని అమర్నాథ్ తెలిపారు. దీని విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని ఆయన వెల్లడించారు. దేవాదాయ శాఖకు చెందిన ఈ విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే అధికారం అధికారులకు ఎక్కడిదని ఆయన నిలదీశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ప్రైవేట్ స్థలంగా చూపుతూ అధికారులు ఏ ప్రాతిపదికన నివేదిక ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఒక 'దొంగల ముఠా' ఏర్పడిందని, కూటమి నేతల అండతో ప్రభుత్వ, దేవాదాయ భూములను ఈ ముఠా దోచుకుంటోందని ఆరోపించారు. రూ.100 కోట్ల విలువైన ఈ భూమి ఇప్పటికే కౌలుదారుల పేరు మీదకు మారిందని, ఈ భారీ కుంభకోణంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు.

# 25 రోజులకు సరిపడా చమురు

## సౌకర్యవంతమైన స్థితిలో భారత్.. ముందస్తు వ్యూహంతో తప్పిన ఇబ్బందులు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ యుద్ధం కారణంగా పశ్చిమ ఆసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో, భారతదేశ ఇంధన భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ ఆందోళనలకు చెక్ పెడుతూ భారత ప్రభుత్వ వర్గాలు కీలక విషయాలను వెల్లడించాయి. ముడిచమురు, ఎల్పీజీ, ఎల్ఎన్జీ నిల్వల విషయంలో భారత్ ప్రస్తుతం అత్యంత సురక్షితమైన, సౌకర్యవంతమైన స్థితిలో ఉందని స్పష్టం చేశాయి. ప్రస్తుతం దేశంలో సుమారు 25 రోజులకు సరిపడా ముడిచమురు మరియు పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో దేశంలోని రిజర్వ్ ట్యాంకుల్లో ఉన్న నిల్వలతో పాటు, ప్రస్తుతం సముద్ర మార్గంలో భారత నౌకాశ్రయాలకు వస్తున్న ఇంధన నౌకల్లోని సరుకు కూడా కలిపి లెక్కించినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా భారత్ తన ఇంధన అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఇందులో సుమారు 50 శాతం చమురు పశ్చిమ ఆసియా దేశాల నుంచే వస్తుంది. ఇరాన్ యుద్ధం కారణంగా ఈ ప్రాంతంలోని కీలకమైన 'హార్ముజ్ జలసంధి' గుండా జరిగే రవాణాకు ఆటంకం ఏర్పడింది. అయితే, గత కొన్నేళ్లుగా భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ తన చమురు దిగుమతులను వైవిధ్యభరితం చేసింది. కేవలం గల్ఫ్ దేశాలపైనే ఆధారపడకుండా ఆఫ్రికా, రష్యా మరియు అమెరికా దేశాల నుంచి దిగుమతులను గణనీయంగా పెంచుకుంది. దీనివల్ల హార్ముజ్ జలసంధిలో అవాంతరాలు ఏర్పడినా, భారత్‌కు వచ్చే సరఫరాలో పెద్దగా కోత పడలేదని ఓ సీనియర్ అధికారి వివరించారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థల వద్ద రాబోయే కొన్ని వారాలకు సరిపడా స్టాక్ ఉందని, వివిధ మార్గాల ద్వారా సరఫరా కొనసాగుతోందని తెలిపారు. మరోవైపు, దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, బఫర్ స్టాక్‌ను మరింత పెంచేందుకు చమురు కంపెనీలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్రోలియం ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయవద్దని సూచించింది.

**వ్యూహాత్మక నిల్వలు - సామర్థ్యం:**

**అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి భారత్ వ్యూహాత్మక చమురు నిల్వలను ఏర్పాటు చేసుకుంది.**

**పాదూరులో 2.25 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం, విశాఖపట్నంలో 1.33 మిలియన్ మెట్రిక్‌టన్నుల సామర్థ్యం, మంగళూరులో 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన స్టోరేజ్ సౌకర్యాలు ఉన్నాయి.**

**అదనంగా, ఒడిశాలోని చండిఖోల్ తీర ప్రాంతంలో మరో భారీ నిల్వ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు.**

**అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని తాకినప్పుడు లేదా సరఫరా నిలిచిపోయినప్పుడు ఈ నిల్వలను వినియోగించుకోవడం ద్వారా దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవచ్చు.**






## నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లెక్క: డీకే

బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు, నాయకత్వలేమిపై వస్తున్న వార్తలకు డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్ (డీకే) తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో పూర్తి ఐక్యత ఉందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన అనుబంధం 'పాలు-తేనె' లాంటిదని ఆయన అభివర్ణించారు. మంగళవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీఎం సిద్ధరామయ్య ఇచ్చిన వివరణను సమర్థించారు. విపక్ష నాయకులు రాజకీయ దురుద్దేశంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని, సీఎం అనుభవంతో మాట్లాడారని కొనియాడారు. "మా ఇద్దరి మధ్య బంధం పాలు-తేనెలా కలిసిపోయింది. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి మార్పుపై ఇప్పటివరకూ ఎలాంటి చర్చ జరగలేదని డీకే స్పష్టం చేశారు. అలాగే, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా తాను ఆరేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మార్చి 10న ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కేపీసీసీ అధ్యక్ష పదవిలో తన కొనసాగింపుపై స్పందిస్తూ.. కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరాధారమైనవని సీఎం సిద్ధరామయ్య ఇదివరకే కొట్టిపారేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, కానీ తాము పార్టీ హైకమాండ్‌కు కట్టుబడి ఉన్నామని ఇద్దరు నేతలు మరోసారి స్పష్టం చేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ మార్పు విషయంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీకే తెలిపారు.

## ఇరాన్ చర్చలకు వస్తానంది.. వద్దన్నా: ట్రంప్

వాషింగ్టన్: యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన పునరుద్ఘాటించారు.

# 1,700 టార్గెట్లు

**72 గంటల్లోనే ఇరాన్ లక్ష్యాల ఛేదన**

**అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'**

**భారీ సైనిక చర్యకు దిగిన ట్రంప్**

టెహ్రాన్: ఇరాన్‌పై అమెరికా భారీ సైనిక చర్యకు దిగింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా తొలి 72 గంటల్లోనే 1,700కు పైగా లక్ష్యాలను ఛేదించినట్లు ప్రకటించింది. బాంబర్లు, ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలతో ఇరాన్‌లోని కీలక ప్రాంతాలపై విరుచుకుపడుతోంది. ఈ యుద్ధంలో అమెరికాదే గెలుపని, ఉగ్రవాద ఇరాన్ పాలన ఓడిపోతుందని వైట్‌హౌస్ ధీమా వ్యక్తం చేసింది. ఈ మేరకు పెంటగాన్ ఒక ఫ్యాక్ట్ షీట్‌లో వెల్లడించిందిపెంటగాన్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ ప్రకారం, ఫిబ్రవరి 28న తెల్లవారుజామున 1:15 గంటలకు 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైంది. అమెరికా అధ్యక్షుడి ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఈ దాడులను ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను ధ్వంసం చేయడం, వారి నౌకాదళాన్ని నిర్వీర్యం చేయడం, ఉగ్రవాద అనుబంధ సంస్థలను నిలువరించడం, ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా చూడటం వంటి నాలుగు లక్ష్యాలను వైట్‌హౌస్ నిర్దేశించింది. ఇరాన్ తన మొబైల్ లాంచర్లతో విచక్షణారహితంగా క్షిపణులను ప్రయోగిస్తోందని, ఆ ముప్పులను ఎలాంటి సంకోచం లేకుండా తొలగిస్తున్నామని సెంట్‌కామ్ స్పష్టం చేసింది. ఈ ఆపరేషన్ కోసం అమెరికా భారీస్థాయిలో సైనిక సంపత్తిని మోహరించింది. బీ-1, బీ-2, దీ-52 బాంబర్లు, ఎఫ్-15, ఎఫ్-16, ఎఫ్-18, ఎఫ్-22, ఎఫ్-35 ఫైటర్ జెట్లతో పాటు ఏ-10 అటాక్ జెట్లను రంగంలోకి దించింది. వీటితో పాటు పేట్రియాట్, థాడ్ వంటి క్షిపణి నిరోధక వ్యవస్థలు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఎం-142 హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్స్, అణుశక్తితో నడిచే విమాన వాహక నౌకలు, గైడెడ్-మిస్సైల్ డిస్ట్రాయర్లను కూడా ఉపయోగిస్తున్నట్లు పెంటగాన్ తెలిపింది. ఈ దాడుల్లో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, ఐఆర్‌జీసీ జాయింట్ హెడ్‌క్వార్టర్స్, బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రాలు, ఇరాన్ నౌకాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, సైనిక కమ్యూనికేషన్ వ్యవస్థలు వంటి కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సైనిక చర్య కొనసాగుతుండగానే, అమెరికాలోని సొంత పార్టీ డెమొక్రాటిక్ సభ్యుల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ఆపరేషన్‌పై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరుతూ మార్చి 2న కొందరు చట్టసభ సభ్యులు జాతీయ భద్రతా అధికారులకు లేఖ రాశారు. ఈ ఘర్షణలో ఇప్పటికే కొందరు అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ లక్ష్యాలు, చట్టపరమైన ప్రాతిపదిక, వ్యూహంపై కాంగ్రెస్‌కు, అమెరికా ప్రజలకు వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 1979 నుంచి అమెరికా, ఇరాన్ మధ్య శత్రుత్వం కొనసాగుతోంది. ఇరాన్ అణు కార్యక్రమం, బాలిస్టిక్ క్షిపణి అభివృద్ధి, ప్రాంతీయ సాయుధ గ్రూపులకు మద్దతు వంటి అంశాలపై ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఈ దాడుల ప్రభావం పడితే, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.



# ఇరాన్ అధ్యక్ష భవనంపై బాంబుల వర్షం

**100 యుద్ధ విమానాలతో 250కి పైగా బాంబులు**

**అమెరికా ఎంబసీలపైనా ఇరాన్ ప్రతీకార దాడులు**

టెహ్రాన్: టెహ్రాన్‌లోని ఇరాన్ అధ్యక్ష భవనంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. రాజధానిలో అత్యంత పటిష్టమైన భద్రత ఉండే నాయకత్వ సముదాయంపై ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) విరుచుకుపడ్డాయి. ఈ భారీ వైమానిక దాడుల్లో ఇరాన్ అధ్యక్ష భవనం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనాలను లక్ష్యంగా చేసుకున్నారు. కచ్చితమైన సమాచారంతో సుమారు 100 ఫైటర్ జెట్‌లను ఉపయోగించి 250కి పైగా బాంబులను జారవిడిచినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్ రాజకీయ, సైనిక నిర్ణయాలు తీసుకునే కీలక కేంద్రంగా ఈ సముదాయం ఉంది. ఇరాన్ అణు కార్యక్రమాలు, ఇజ్రాయెల్‌పై వ్యూహాలను ఇక్కడే రచిస్తారని, అందుకే ఇరాన్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడులు చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. ఇక్కడి నుంచే ఇరాన్ సైనిక, భద్రతా వ్యవహారాలన్నీ నడుస్తాయని, ఇది ఉగ్రవాద పాలనకు ప్రధాన కార్యాలయంగా మారిందని ఐడీఎఫ్ పేర్కొంది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ప్రారంభించిన ఈ దాడుల్లో ఇప్పటికే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు ముమ్మరం చేసింది. తాజాగా సౌదీ అరేబియా, కువైట్‌లోని అమెరికా ఎంబసీలపై ఇరాన్ డ్రోన్ దాడులు చేయడంతో అక్కడ పాక్షికంగా ఆస్తి నష్టం వాటిల్లింది. అటు ఇరాన్‌లోని నతాంజ్ అణు కేంద్రం కూడా దెబ్బతిన్నట్లు ఐఏఈఏ నిర్ధారించింది. మరోవైపు ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌పై దీర్ఘకాలిక ఆపరేషన్‌కు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. దీంతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు మరింత ముదురుతున్నాయి.



## దేశంలో 101.78 కోట్ల ఇంటర్నెట్ యూజర్లు

న్యూఢిల్లీ: భారత టెలికం రంగం వృద్ధి పథంలో దూసుకెళుతోంది. దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 102 కోట్ల (1.02 బిలియన్) మార్కును దాటింది. టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) మంగళవారం విడుదల చేసిన 'ఇండియన్ టెలికాం సర్వీసెస్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్' నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 2025 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలను ట్రాయ్ ప్రకటించింది. నివేదిక ప్రకారం, సెప్టెంబర్ 2025 నాటికి 101.78 కోట్లుగా ఉన్న ఇంటర్నెట్ వినియోగదారులు.. డిసెంబర్ నాటికి 102.86 కోట్లకు చేరారు. ఇది 1.06 శాతం వృద్ధిని సూచిస్తోంది. వీరిలో 98 కోట్లకు పైగా వైర్‌లెస్ వినియోగదారులే ఉండటం గమనార్హం. ముఖ్యంగా బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 100 కోట్లు (1 బిలియన్) దాటడం దేశంలో హై-స్పీడ్ డేటా సేవలకు ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తోంది. మొత్తం టెలిఫోన్ వినియోగదారుల సంఖ్యలోనూ భారీ వృద్ధి నమోదైంది. సెప్టెంబర్‌లో 122.89 కోట్లుగా ఉన్న ఈ సంఖ్య.. డిసెంబర్ నాటికి ఏకంగా 130.61 కోట్లకు పెరిగింది. త్రైమాసిక పరంగా చూస్తే ఇది 6.28 శాతం వృద్ధి. టెలికాం కంపెనీల ఆదాయాల్లోనూ సానుకూల ఫలితాలు కనిపించాయి. డిసెంబర్ త్రైమాసికంలో టెలికాం రంగం స్థూల ఆదాయం రూ.1,02,475 కోట్లుగా నమోదైంది. కంపెనీలకు ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం రూ.190.99 నుంచి రూ.194.57కు పెరిగింది. ఇక బ్రాడ్‌కాస్టింగ్ రంగానికి సంబంధించి, దేశంలో ప్రస్తుతం 920 ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానెళ్లు ఉన్నాయని, అందులో 335 పే ఛానెళ్లు అని ట్రాయ్ తన నివేదికలో పేర్కొంది.

## షకీరా లైవ్‌షోకి 4 లక్షల మంది

**మెక్సికోలో చరిత్ర సృష్టించిన పాప్ సింగర్**

మెక్సికో సిటీ: ప్రముఖ పాప్ గాయని షకీరా మెక్సికోలో సరికొత్త సంచలనం సృష్టించింది. మెక్సికో సిటీలోని ఐకానిక్ జోకాల స్క్వేర్ వేదికగా వారాంతంలో ఆమె నిర్వహించిన లైవ్ పర్ఫార్మెన్స్‌కు జనం పోటెత్తారు. ఏకంగా 4 లక్షల మందికి పైగా అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జోకాల స్క్వేర్ చరిత్రలోనే ఇంతటి భారీ జనసందోహం హాజరవడం ఇదే తొలిసారి అని గణాంకాలు చెబుతున్నాయి. ఉచితంగా నిర్వహించిన ఈ ఈవెంట్ కోసం దేశం నలుమూలల నుంచి అభిమానులు తరలిరావడంతో మెక్సికో సిటీ మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. 'ఫిమేల్ ఫస్ట్ యూకే' కథనం ప్రకారం.. రద్దీని తట్టుకునేందుకు, అందరికీ ఈవెంట్ కనిపించేలా సమీపంలోని అలమెడా సెంట్రల్, మాన్యుమెంట్ టు ది రివల్యూషన్ ప్రాంతాల్లో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఈ షోలో కొలంబియన్ ఆర్టిస్ట్ బీలేతో కలిసి షకీరా వేదిక పంచుకుంది. మే 4న విడుదల కానున్న తమ కొత్త పాట 'అల్గో టు'ను ఈ సందర్భంగా ప్రదర్శించింది. షకీరా తన సూపర్ హిట్ సాంగ్స్ అయిన హిప్స్ డోంట్ లై, వాకా వాకా (దిస్ టైమ్ ఫర్ ఆఫ్రికా), డోంట్ బాదర్ వంటి పాటలతో అభిమానులను ఉర్రూతలూగించింది. ఈ విజయంతో రెట్టింపు ఉత్సాహంతో ఉన్న షకీరా.. మే 2న రియో డి జనీరోలోని కోపకబానా బీచ్‌లో జరిగే మరో భారీ ఉచిత కాన్సర్ట్‌కు సిద్ధమవుతోంది. మరోవైపు, షకీరా నిర్వహించిన 'లాస్ ముజెరెస్ యా నో ల్లోరన్' వరల్డ్ టూర్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన హిస్పానిక్ టూర్‌గా నిలిచినట్లు బిల్‌బోర్డ్ ఇటీవల ధృవీకరించింది. అమెరికా, లాటిన్ అమెరికా వ్యాప్తంగా 82 షోల ద్వారా 421.6 మిలియన్ డాలర్ల వసూళ్లతో పాటు 33 లక్షల మందిని ఆకర్షించి రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, ప్రతిష్ఠాత్మక రాక్ అండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేమ్-2026 నామినేషన్లలో షకీరా చోటు దక్కించుకోవడం మరో విశేషం.

## హోర్ముజ్ జలసంధి వద్ద 37 భారత నౌకలు

**పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్, సమీప ప్రాంతాల్లో నిలిచిన నౌకలు**

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశం జెండాలు ఉన్న 37 నౌకలు హోర్ముజ్ జలసంధి తదితర ప్రాంతాల్లో నిలిచిపోయాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం కారణంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 1,109 మంది నావికులతో కూడిన సుమారు 37 భారత జెండా కలిగిన నౌకలు పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్, సమీప ప్రాంతాల్లో నిలిచిపోయాయి. ఇందులో కొన్ని నౌకలు భారత ఓడరేవులకు ముడి చమురు, ఎల్ఎన్‌జీతో వస్తుండగా, మరికొన్ని గల్ఫ్ దేశాల నుంచి పెట్రోలియం ఉత్పత్తులు తీసుకురావడానికి వెళుతున్నవి ఉన్నాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆయా కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా విదేశీ జెండాలు కలిగిన నౌకల్లోని ముగ్గురు భారతీయ నావికుల మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మన నావికులు, మన నౌకల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసింది. షిప్పింగ్ కంపెనీస్ అండ్ రిక్రూట్మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్సీస్ (ఆర్పీఎస్ఎల్ఎస్) నావికులకు కీలక సూచనలు జారీ చేసింది. యుద్ధం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, బంధువులతో క్రమం తప్పకుండా కమ్యూనికేట్ కావాలని సూచించింది. నావికుల కోసం హెల్ప్ లైన్ నెంబర్లను కూడా యాక్టివేట్ చేసింది.




## భగ్గుమంటున్న విమాన టికెట్లు

**చుక్కల్లో ఢిల్లీ-లండన్ డైరెక్ట్ ఫ్లయిట్ రేట్లు**

**రూ.7 లక్షల వరకు చేరిన పరిస్థితి**


న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయ ప్రయాణికులపై, ముఖ్యంగా భారత్ నుంచి యూరప్ వెళ్లేవారిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న క్షిపణి, డ్రోన్ దాడుల కారణంగా ఆయా దేశాల గగనతలం ప్రమాదకరంగా మారింది. దీంతో ఢిల్లీ నుంచి లండన్‌కు వెళ్లే నాన్-స్టాప్ (డైరెక్ట్) విమానాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీని ప్రభావంతో విమాన టికెట్ ధరలు సామాన్యులే కాదు, సంపన్నులు కూడా భయపడే స్థాయికి, అంటే సుమారు రూ.7 లక్షల వరకు చేరాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు జరపడం, ప్రతిగా ఇరాన్ క్షిపణి దాడులకు దిగడంతో ఈ పరిస్థితి తలెత్తింది. భద్రతా కారణాల దృష్ట్యా ఎయిర్ ఇండియా మార్చి 9 వరకు తమ ఢిల్లీ-లండన్ సర్వీసులను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత లభించే టికెట్ల ధర రూ.6 లక్షల వరకు ఉంది. ఇక వర్జిన్ అట్లాంటిక్ విమానాలు మార్చి 10 వరకు అందుబాటులో లేకపోగా, ఆ తర్వాత టికెట్ ధర ఏకంగా రూ.7.59 లక్షల వరకు పలుకుతోంది. సాధారణంగా 9 నుంచి 10 గంటల్లో పూర్తయ్యే ఈ ప్రయాణం, ఇప్పుడు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో ఒకటి లేదా మూడు స్టాప్‌లతో కలిపి 26 నుంచి 31 గంటల సమయం తీసుకుంటోంది. "లాంగ్ రూట్ల వల్ల ఇంధన ఖర్చులు, సిబ్బంది డ్యూటీ సమయం, నిర్వహణ భారం విపరీతంగా పెరిగాయి. సప్లై తగ్గిపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి," అని ఏవియేషన్ కార్గో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ డాక్టర్ వందనా సింగ్ వివరించారు. అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రయాణికులు కతార్ ఎయిర్‌వేస్ (దోహా మీదుగా రూ.1.40 లక్షలు), ఎమిరేట్స్ (ముంబై నుంచి దుబాయ్ మీదుగా రూ.28 వేల (ప్రారంభ ధర) వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవడం లేదా యూరప్ గేట్‌వేల ద్వారా రైలు మార్గాలను ఎంచుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇండోనేషియాలో భారీ భూకంపం

న్యూఢిల్లీ: ఇండోనేషియాలోని సుమత్రా దీవి భూకంపంతో ఉలిక్కిపడింది. మంగళవారం ఉదయం 10:26 గంటలకు (భారత కాలమానం ప్రకారం) సుమత్రా దీవి పరిసరాల్లో 6.2 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ధ్రువీకరించింది. భూకంప కేంద్రం సముద్రంలో ఉన్నప్పటికీ, దీవిపై ప్రకంపనలు తీవ్రంగానే వచ్చినట్లు తెలుస్తోంది. భూకంప తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు నివేదికలు రాలేదు. అలాగే భవనాలు కూలిపోవడం గానీ, ఆస్తులకు భారీ నష్టం వాటిల్లడం గానీ జరగలేదు. సముద్రంలో భూకంపం రావడంతో సునామీపై ఆందోళన వ్యక్తమైనప్పటికీ.. అధికారులు మాత్రం సునామీ హెచ్చరికలేవీ జారీ చేయలేదు. ఎలాంటి సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇండోనేషియా పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటం వల్లే ఇక్కడ తరచూ ఇలాంటి ప్రకంపనలు వస్తుంటాయి. టెక్టోనిక్ ప్లేట్లు కలిసే ప్రాంతం కావడంతో భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోరణాలు ఇక్కడ సర్వసాధారణం. ఉదయం ఒక్కసారిగా భూమి కంపించడంతో స్థానికులు భయంతో ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రస్తుతం అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇవాళ ఇరాన్ లోనూ 4.3 తీవ్రతతో భూకంపం సంభవించడం తెలిసిందే.

## వయ్యారి చిత్రం



## వరుణ్ వరుస సినిమాలు

క్రేజీ లైనప్‌తో బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్ట్‌లని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాడు.. వరుణ్ తేజ్. ప్రస్తుతం మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న కొరియన్ రీమేక్ థ్రిల్లర్ కొరియన్ కనకరాజులో నటిస్తున్నాడు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అండ్ యువీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇదొక హారర్ కామెడీ. రితికా నాయక్ హీరోయిన్. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మూవీని సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతున్న నేపథ్యంలో వరుణ్ తేజ్ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్ట్‌లని లైన్‌లో పెట్టేస్తున్నాడు. ఆయ్ ఫేమ్ అంజి కె. మణిపుత్ర దర్శకత్వంలో ఓ సినిమాకు ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. దీన్ని పింక్ ఎలిఫెంట్ బ్యానర్‌పై వరుణ్ సోదరి నిహారిక నిర్మించడానికి ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే స్టోరీ సిట్టింగ్స్ పూర్తయ్యాయి. కథ లాక్ అయిపోయింది. ఉగాది సందర్భంగా దీన్ని ప్రారంభిస్తారని తెలుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. అలాగే రవితేజతో టచ్ చేసి చూడు మూవీ చేసిన విక్రమ్ సిరికొండతో కూడా ఓ మూవీకి వరుణ్ కమిట్ అయినట్టుగా చెబుతున్నారు. ఇవే కాకుండా వరుణ్ తేజ్ భారీ ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. మట్కాతో పాన్ ఇండియా బ్లాక్ బస్టర్‌ని సొంతం చేసుకోవాలని ప్రయత్నించి ఫెయిల్ కావడంతో ఈ సారి పక్కా ప్లాన్‌తో క్రేజీ డైరెక్టర్‌తో భారీ సినిమాకు శ్రీకారం చుట్టాలని ప్లాన్ చేసుకుంటున్నాడట. ఇందు కోసం కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీని ఎంచుకున్నాడని, ప్రస్తుతం దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## 22న ఉస్తాద్ ప్రీ రిలీజ్ ఈవెంట్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. గతంలో 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్‌ను అందించిన ఈ క్రేజీ కాంబోపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్ర ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను మార్చి 22న అత్యంత భారీ స్థాయిలో నిర్వహించేందుకు చిత్ర యూనిట్ సన్నద్ధమవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా రెండు రోజుల సమయాన్ని కేటాయించారని తెలుస్తోంది. పవర్ స్టార్ స్వయంగా ప్రచార బరిలోకి దిగుతుండటంతో సినిమాపై హైప్ అమాంతం పెరిగిపోతోంది.




## కృతి సనన్‌కు అవార్డు.. ట్రోల్స్!



## మార్చి 8న టీవీల్లోకి 'శంబాల'



టాలీవుడ్ యువ హీరోల్లో ఒకరైన ఆది సాయి కుమార్ హీరోగా నటించిన లేటెస్ట్ సూపర్ హిట్ చిత్రమే "శంబాల". దర్శకుడు యుగంధర్ ముని తెరకెక్కించిన ఈ ఇంట్రెస్టింగ్ డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ ఆది సాయి కుమార్ కి మంచి కంబ్యాక్ సినిమాగా నిలిచి అదరగొట్టింది. తన కెరీర్ లో హైయెస్ట్ గ్రాసర్స్ లో ఒకటిగా నిలిచిన ఈ సినిమా ఓటీటీలోకి వచ్చిన తర్వాత కూడా మంచి రెస్పాన్స్ ని అందుకుంది. అయితే థియేటర్స్, ఓటీటీ తర్వాత ఈ సినిమా బుల్లితెరపై కూడా సందడి చేసేందుకు సిద్ధం అయ్యింది. ఈ సినిమా శాటిలైట్ హక్కులు జీ తెలుగు సొంతం చేసుకోగా వారు ఈ థ్రిల్లర్ సినిమా వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ డేట్ అందించారు. మార్చి 8 సాయంత్రం 6 గంటలకి ఈ సినిమా ప్రసారం కానున్నట్టు కన్ఫర్మ్ చేశారు.

సినిమా అవార్డుల నిజాయితీపై నమ్మకం లేదనే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. జీ సినీ అవార్డ్స్ 2026 వేడుక ఇందుకు అతీతం కాదు. అవార్డుల కార్యక్రమం ముగిసినా.. దాని చుట్టూ ఉన్న వివాదాలు మాత్రం ఇప్పుడప్పుడే తగ్గేలా లేవు. ఆదివారం (మార్చి 1) జరిగిన ఈ ప్రయివేట్ అవార్డుల వేడుకలో తేరే ఇష్క్ మే చిత్రానికి గానూ కృతి సనన్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. అయితే ఈ ఎంపికపై నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా అవార్డుల ఎంపిక తీరును ప్రశ్నిస్తూ.. కృతి కంటే అర్హులైన వారు రేసులో ఉన్నారని వాదిస్తున్నారు. ముఖ్యంగా కంగనా రనౌత్ లేదా యామీ గౌతమ్‌లలో ఒకరికి ఈ అవార్డు దక్కాల్సిందని మెజారిటీ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఎమర్జెన్సీ చిత్రంలో ఇందిరా గాంధీ పాత్రలో కంగనా పరకాయ ప్రవేశం చేయగా, హక్ సినిమాలో యామీ గౌతమ్ తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. వీరిద్దరినీ కాదని కృతి సనన్‌ను విజేతగా ప్రకటించడంపై సినిమా లవర్స్ తీవ్రంగా మండిపడుతున్నారు.

## బాడీ పార్ట్స్ జూమ్ ఎందుకో




'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి సప్తమి గౌడ సినిమా వేడుకల్లో ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్ల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా నటులను అసభ్యకరమైన కోణాల్లో చిత్రీకరించడంపై ఆమె సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంచలన పోస్ట్ పెట్టారు. పబ్లిక్ ఈవెంట్లలో ఫీమేల్ యాక్టర్స్ కనిపిస్తే, వారి నటన లేదా పని కంటే వారి శరీర భాగాలపైనే కెమెరాలు జూమ్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "మేము ఇక్కడ ఉన్నది మా కళ కోసం, సినిమా కోసం. కానీ కొంతమంది ఉద్దేశపూర్వకంగా అసభ్యకరమైన యాంగిల్స్ నుంచి ఫొటోలు తీస్తూ మమ్మల్ని కించపరుస్తున్నారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది ఒక వ్యక్తి గౌరవానికి సంబంధించిన విషయం. ఈవెంట్లను కవర్ చేసే వారు వృత్తి నైపుణ్యాన్ని, కనీస మర్యాదను పాటించాలి. ఇలాంటి పనులను మేము అస్సలు సహించము. ఈ విషయంలో మహిళా నటులమంతా ఐక్యంగా ఉన్నాము" అని రాసుకొచ్చారు.

## సోషల్ మీడియాకు ఆలియా గుడ్‌బై

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ మరోసారి వార్తల్లో నిలిచారు. సెలబ్రిటీలు తరచుగా సోషల్ మీడియా విమర్శలు, ట్రోలింగ్, వ్యక్తిగత ఒత్తిళ్ల మధ్య దాన్నుంచి కొంత విరామం తీసుకోవడం సాధారణమే. ఇప్పటికే పలువురు స్టార్‌లు ఇలాంటి నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో, తాజాగా ఆలియా కూడా సోషల్ మీడియా బ్రేక్ తీసుకోవాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇటీవలి కాలంలో ఆమె ఇంటర్నేషనల్ స్టేజ్‌లపై చేసిన ప్రదర్శనలు, ఫ్యాషన్ అప్పియరెన్సులు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. కొంతమంది నెటిజన్లు ఆమె స్టైల్, ఎంపికలపై విమర్శలు గుప్పించగా, మరికొందరు వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారు. ఈ ట్రోలింగ్ ఆమెను లోపల నుంచి ప్రభావితం చేసినట్టుగా సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. బయటకు ఎంత నిర్లక్ష్యంగా కనిపించినా, నిరంతర విమర్శలు ఎంతటి వారినైనా మానసికంగా కలవరపెడతాయని ఆమెకు దగ్గరైన వ్యక్తులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఆలియా కొంతకాలం పాటు సోషల్ మీడియా దూరంగా ఉండి, పూర్తిగా తన కెరీర్ పరమైన కమిట్‌మెంట్స్‌పై దృష్టి సారించాలని భావిస్తున్నట్టు సమాచారం.





# ఎవరు ఫైనలిస్టు?




### నేడే తొలి సెమీ ఫైనల్
### సౌతాఫ్రికానా? న్యూజిలాండా?
### సఫారీలపై కివీస్‌దే డామినేషన్

టీ20 ప్రపంచ కప్ చివరి దశకు చేరుకుంది. టోర్నమెంట్‌లో తొలి సెమీఫైనల్‌కు సమయం ఆసన్నమైంది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా- న్యూజిలాండ్ మధ్య అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇందులో నెగ్గి ఫైనల్ బెర్తు ఖరారు చేసుకోవాలని ఇరుజట్లు ఉవ్విళ్లూరుతున్నాయి. దీంతో ఈ పోరు రసవత్తరంగా సాగడం ఖాయంగా కనిపిస్తుంది. ఈ టోర్నమెంట్‌లో దక్షిణాఫ్రికా అద్భుతంగా రాణిస్తోంది. గ్రూప్ దశతోపాటు సూపర్ 8లోనూ ఇప్పటిదాకా ఓటమి అనేది లేకుండా ఆడిన అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించింది. కీలకమైన సూపర్ 8లో మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి గ్రూప్ 1లో అగ్రస్థానం దక్కించుకుంది. అలాగే గ్రూప్ దశలో ఇప్పటికే కివీస్‌తో సఫారీ జట్టు తలపడింది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా న్యూజిలాండ్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. బుధవారం నాటి మ్యాచ్‌లోనూ అదే ప్రదర్శనను పునరావృతం సఫారీలు భావిస్తున్నారు. ఈ జట్టులో కెప్టెన్ మార్‌క్రమ్‌తోపాటు డికాక్, రికిల్‌టన్, డివాల్డ్ బ్రేవిస్, మిల్లర్, బోష్, ఎంగ్డి, రబాడా కీలక ఆటాగాళ్లు. మరోవైపు, సూపర్ -8 దశలో న్యూజిలాండ్ ఒక్కటంటే ఒకే మ్యాచ్‌లో గెలిచినప్పటికీ మెరుగైన్ రన్‌రేట్ ఉండడంతో సెమీస్‌లోకి దూసుకొచ్చింది. అయితే జోరుమీదున్న దక్షిణాఫ్రికాను ఆపడం మాత్రం కివీస్‌కు పెద్ద సవాలే. కానీ శాంట్నర్, ఫిన్ అలెన్, రచిన్, డారిల్ మిచెల్‌తో జట్టు బలంగానే కనిపిస్తుంది. కాష్టపడితే సౌతాఫ్రికాను ఓడించడం పెద్ద కష్టమేమీ కాదు. ఇక 2021 ఎడిషన్ తర్వాత తొలిసారి టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకోవాలని కివీస్ కలలు కంటోంది. దక్షిణాఫ్రికా - న్యూజిలాండ్ ఇప్పటివరకు మొత్తం 19 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాయి. ఇందులో దక్షిణాఫ్రికాదే పైచేయిగా ఉంది. అత్యధికంగా 12 మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికా గెలిచింది. అటు న్యూజిలాండ్ కేవలం 7 మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. అయితే న్యూజిలాండ్ - దక్షిణాఫ్రికా టీ20 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో తలపడటం మాత్రం ఇదే మొదటిసారి. కాగా, ఈ రెండు జట్లు ఇప్పటివరకు ఐసీసీ టోర్నమెంట్‌లలో మూడుసార్లు నాకౌట్ మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఇందులో దక్షిణాఫ్రికాకు పేలవమైన రికార్డు ఉంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఎప్పుడూ గెలవలేదు. అందుకే ఈసారి నెగ్గి కొత్త చరిత్ర సృష్టించాలని సఫారీలు ఆశిస్తున్నారు. న్యూజిలాండ్ - దక్షిణాఫ్రికా మధ్య జరిగిన తొలి ఐసీసీ నాకౌట్ మ్యాచ్ 2011 వన్డే ప్రపంచ కప్‌లో జరిగింది. అది క్వార్టర్ ఫైనల్. ఢాకాలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను న్యూజిలాండ్ 49 పరుగుల తేడాతో ఓడించింది. ఆ తర్వాత 2015 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో కివీస్ - సఫారీ తలపడ్డాయి. ఆక్లాండ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. ఇక గతేడాది 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో నాకౌట్ మ్యాచ్‌లోనూ ఇరు జట్లు మూడోసారి తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో కూడా దక్షిణాఫ్రికాను న్యూజిలాండ్ 50 పరుగుల తేడాతో ఓడించింది. అలా ఐసీసీ టోర్నీల్లో నాకౌట్‌లో మూడుకు మూడుసార్లు కివీసే నెగ్గింది. ఈ తొలి సెమీఫైనల్ మ్యాచ్ భారత సమయం ప్రకారం సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ మ్యాచ్ ప్రారంభానికి 30 నిమిషాల ముందు, అంటే సాయంత్రం 6:30 గంటలకు పడుతుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడొచ్చు.


### సెమీస్ నుంచి
## అభిషేక్ అవుట్!?

భారత అభిమానులకు బిగ్ అలర్ట్. ఎన్నో రోజులుగా భారత జట్టుకు ఓపెనర్ సమస్యను తీర్చుతున్న అభిషేక్ శర్మ భవిష్యత్తు ఇప్పుడు డేంజర్ జోన్ లో పడింది. మొన్నటి ఆసియా కప్, టీ20 టోర్నమెంట్స్ సందర్భంగా అద్భుతంగా రాణించిన అభిషేక్ శర్మ, టీ20 వరల్డ్ కప్ వచ్చే సమయానికి తేలిపోతున్నాడు. ఏ మాత్రం ఆడలేక పోతున్నాడు. దీంతో అతనిపై యాక్షన్ తీసుకునేందుకు భారత జట్టు యాజమాన్యం రంగం సిద్ధం చేసినట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇందులో భాగంగానే భారత్, ఇంగ్లాండ్ మధ్య జరగబోయే సెమీస్ పోరు నుంచి అభిషేక్ శర్మను తప్పించాలని డిసైడ్ అయ్యారని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం అభిషేక్ శర్మ మెరుగైన ఫామ్ లో లేడు.. పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఈ తరుణంలో అభిషేక్ శర్మను పక్కకు పెట్టి రింకు సింగ్ ను తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పుడు సంజు, ఇషాన్ కిషన్ ఓపెనర్లుగా బరిలోకి దిగుతారు. ఇటు రింకు సింగ్ ఫినిషర్ గా వస్తాడు. అతడు ఏ స్థానంలో వచ్చినా 300 స్ట్రైక్ రేట్ తో బ్యాట్ జులిపిస్తాడు. అందుకే అభిషేక్ శర్మకు సెమీ ఫైనల్ లో రెస్ట్ ఇచ్చి.. రింకు సింగ్ ను తెరపైకి తీసుకువచ్చారు. అయితే దీనిపై మ్యాచ్ ప్రారంభం అయితేనే క్లారిటీ వస్తుంది. చివరి క్షణంలో ప్లాన్ మార్చే అవకాశాలు కూడా ఉంటాయి. మొత్తానికి అభిషేక్ శర్మ లాంటి డేంజర్ ఆటగాన్ని పక్కన పెట్టడం పెను సవాల్ లాంటిదే. రింకు సింగ్ ఖచ్చితంగా ఆడతాడు అన్న నమ్మకం లేదు. ఈ టోర్నమెంట్ లో అతడు పెద్దగా రాణించిన దాఖలాలు లేవు. అతని కంటే అభిషేక్ శర్మను కొనసాగించడమే బెటర్ అని కొంత మంది భావిస్తున్నారు. మరి దీనిపై తుది నిర్ణయం భారత జట్టు యాజమాన్యందే.





## చంద్రగ్రహణం.. ఆగిన ప్రాక్టీస్



టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరగనున్న హై-వోల్టేజ్ సెమీఫైనల్ పోరుకు ముందు టీమ్ ఇండియా తన వ్యూహాలకు పదును పెడుతోంది. అయితే, మంగళవారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగాల్సిన భారత జట్టు శిక్షణ షెడ్యూల్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. చంద్రగ్రహణం కారణంగా ప్రాక్టీస్ సెషన్‌ను మేనేజ్‌మెంట్ కొంతకాలం వాయిదా వేసింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. మార్చి 3న సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు టీమ్ ఇండియా ప్రాక్టీస్ చేయాల్సి ఉంది. కానీ, ఆ సమయంలో చంద్రగ్రహణం ఉండటంతో భారత మేనేజ్‌మెంట్ అప్రమత్తమైంది. గ్రహణ సమయంలో శుభకార్యాలు లేదా ముఖ్యమైన పనులు ప్రారంభించడం అరిష్టమన్న నమ్మకంతో, కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు యాజమాన్యం శిక్షణను ఒక గంట ఆలస్యంగా ప్రారంభించాలని నిర్ణయించింది. "సెమీఫైనల్ వంటి కీలక మ్యాచ్‌కు ముందు అంతా శుభం జరగాలని జట్టు కోరుకుంటోంది. చంద్రగ్రహణం సమయంలో ప్రాక్టీస్ చేయడం మంచిది కాదని భావించి, పాజిటివ్ నోట్‌తో సెషన్‌ను ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేశాం" అని జట్టు వర్గాలు వెల్లడించాయి.

## ఆడుతారా.. అప్పగిస్తారా?

### పేలవ ఫాంలో భారత బ్యాటర్లు

వెస్టిండీస్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో సంజూ శాంసన్ (97 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్‌ను టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ కు చేర్చాడు. అయితే, ఈ విజయం వెనుక జట్టులోని తీవ్రమైన లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ మరోసారి కుప్పకూలింది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ మరియు హార్దిక్ పాండ్యా నలుగురూ కలిసి కేవలం 55 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఒక్క శాంసన్ మాత్రమే పోరాడి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసిన 'పైలట్'లా నిలిచాడు. ఓపెనింగ్ జోడీ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో విఫలం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ మరోసారి కుప్పకూలింది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ మరియు హార్దిక్ పాండ్యా నలుగురూ విఫలం అయ్యారు. దాంతో పాటు ఓపెనింగ్ జోడీ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో విఫలం కావడం ఆందోళన కలిగిస్తోంది. వచ్చే మ్యాచ్‌లో ముంబై వేదికగా బలమైన ఇంగ్లాండ్‌ను భారత్ ఎదుర్కోనుంది. జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్ వంటి బౌలర్ల ముందు భారత టాప్ ఆర్డర్ తమ ఫామ్‌ను అందుకోకపోతే సెమీఫైనల్ గండం గడవడం కష్టమేనని మాజీ ఆటగాళ్లు అభిప్రాయపడుతున్నారు.



### వన్డేల్లో నం.1గా
## స్మృతి మంధాన

భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వన్డేల్లో తిరిగి నం.1 బ్యాటర్‌గా అవతరించింది. ఐసీసీ మంగళవారం మహిళల వన్డే ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. స్మృతి ఒక్క స్థానం ఎగబాకి తిరిగి అగ్రస్థానం సాధించింది. 790 రేటింగ్ పాయింట్లతో సౌతాఫ్రికా ప్లేయర్ లారా వొల్వార్డ్(782)ను వెనక్కినెట్టింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ టాప్-10లో చోటు సంపాదించింది. నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని 9వ స్థానానికి చేరుకుంది. మరో బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ 12వ స్థానంలో ఉంది. స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఏకంగా 10 స్థానాలు కోల్పోయి 29వ ర్యాంక్‌కు పడిపోవడం గమనార్హం. బౌలింగ్ విభాగంలో కూడా 5 స్థానాలు కోల్పోయి 10వ స్థానంలో నిలిచింది. తెలుగమ్మాయి, స్పిన్నర్ శ్రీచరణి మూడు స్థానాలు కోల్పోయి 26వ స్థానానికి పడిపోయింది. తాజా ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా పేసర్ అలానా కింగ్ నం.1 బౌలర్‌గా నిలిచింది.

# రైతుకు న్యాయం చేయాలి

తెలుగు రాష్ట్రాల్లో ఫిబ్రవరి చివరి వారంలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్లు, ఈదురుగాలులు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. సిద్దిపేట జిల్లాలోని నాలుగు మండలాల్లో సుమారు 4,000 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి, ముఖ్యంగా దుబ్బాక నియోజకవర్గంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో వరి, మక్క, మామిడి తోటలు దెబ్బతిన్నాయి, ఇక్కడి రైతులు ప్రభుత్వ సర్వేలు, నష్టపరిహారం కోసం డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా మెండోరా, ఎర్గట్ల, డొంకేశ్వర్ మండలాల్లో 188 ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది, గాలులకు మొక్కలు విరిగిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో జొన్న, మక్క పంటలు దెబ్బతిన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి అకాల వర్షాల దెబ్బకు మక్క, గ్రామ్, జొన్న పంటలను దెబ్బతిన్నాయి, పసుపు దిమ్మలు తడిసి నష్టాన్ని మిగిల్చింది. హైదరాబాద్‌లో కూడా ఈ వర్షాలు ప్రభావం చూపాయి. రైతులు పంటలు కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ దెబ్బ వారి ఆశలపై 'నీళ్లు' చల్లింది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు, కానీ రైతులు మరిన్ని వివరాలు సేకరించి త్వరగా నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం పంట నష్టంతోనే సరిపోదు. వర్షాలు కురవడంతో పంటలు తడిసి ముద్దయ్యాయి, మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. మామిడి తోటల్లో పూతలు రాలిపోయాయి, ఇది వచ్చే సీజన్‌పైనా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇప్పుడు తక్షణ చర్యలు తీసుకోవాలి. జిల్లా స్థాయిలో సర్వే బృందాలు ఏర్పాటు చేసి, నష్ట వివరాలు సేకరించాలి. ప్రకృతి విపత్తులకు బీమా పథకాలు, నష్టపరిహారం వంటివి త్వరగా అమలు చేయాలి. పాత అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకుని, వాతావరణ ముందస్తు హెచ్చరికలను మరింత సమర్థంగా అమలు చేయాలి. రైతు దేశానికి వెన్నెముక. వారి నష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే, వ్యవసాయ రంగం మరింత దిగజారుతుంది. ఇప్పుడు సమయం వృథా చేయకుండా, రైతులకు న్యాయం చేయాలి. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడాలి. ఇది కేవలం సహాయం కాదు, న్యాయం.





# స్థిరాస్తి.. జాగ్రత్తలివీ!

**స్థిరాస్తి కొనుగోలు అనేది ఒక ప్రహసనం. ఎంత జాగ్రత్త తీసుకుంటే అంత ప్రశాంతంగా ఉంటారు. స్థిరాస్థి కొనుగోలులో ఎన్నో విషయాలు ఇమిడి ఉంటాయి. అనగా స్థిరాస్థి పైన స్వయం ఆర్జిత హక్కులు, వంశ పారంపర్యమైన లేదా అనువంశిక హక్కులు, డబ్బు వ్యవహారాలు, మోసాలు, కోర్టు వ్యవహారాలు, మొదలగు ఎన్నో అంశాలు ఇమిడి ఉంటాయి. అన్నిజాగ్రత్తలు తీసుకుని సరైన మార్గములో ఖరీదు చేసినవాళ్లే ప్రశాంతముగా ఉండగలగుతారు. లేనిచో స్థిరాస్తి వ్యవహారాలు అనేవి ఒక మానాన కొలిక్కి వచ్చే వ్యవహారాలు కావు. సంవత్సరాల తరబడి సాగే ప్రహసనం. ఎవరైనా ఒక స్థిరాస్తిని కొంటున్నప్పుడు ఈ క్రింది విధంగా తగిన స్థిరాస్థి సంబంధిత పత్రాలను పరీక్షించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.**

ఈసీ పరీక్ష : ఎలాంటి స్థిరాస్థి కొనుగోలు అయినప్పటికినీ మొట్ట మొదటగా పరీక్షించుకోవలసినది ఈసీ పరీక్ష. ఈసీ అనగా అట్టి స్థిరాస్థి పైన ఎలాంటివైనా తనఖా ఉన్నాదా, అప్పులేమయినా ఉన్నాయా, పునరావృతమయ్యే కొనుగోలు వ్యవహారాలు ఏమైనా ఉన్నాయా, లేదా అట్టి స్థిరాస్థిపైన ప్రస్తుత హక్కుదారు ఎవరు అనేది తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

టైటిల్ డీడ్ పరీక్ష : ఇది ప్రస్తుతము కొనుగోలు చేయబోయే స్థిరాస్థి అసలైన హక్కుదారు ఎవరు అనే దానిని తెలియజేస్తుంది. దీనినే సేల్ డీడ్ అని కూడా అంటారు. దీని ద్వారా ప్రస్తుత హక్కుదారు ఎవరు, అట్టి హక్కుదారునకు అమ్మినవారు ఎవరు, ఏ రోజున కొన్నారు, ఎక్కడ కొన్నారు, రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ, రిజిస్ట్రేషన్ జరిగిన స్థలము, రిజిస్ట్రేషన్ జరిపిన అధికారి పేరు, అమ్మిన వారి పేరు, వివరాలు, ఫోటోలు, సాక్షుల పేర్లు , వారి వివరాలు, ఫోటోలు , ప్రాపర్టీ హద్దులు, కొలతలు మొదలగు అన్నీ వివరాలు ఉంటాయి.

లింకు పత్రాల పరీక్ష :పైన తెలిపిన విధంగా స్థిరాస్థిని అమ్ముచున్న వ్యక్తికి ఎవరు అమ్మారు, ఆ అమ్మిన వారికి ఎవరు అమ్మారు, ఆ పైన అమ్మిన వారికి ఎవరు అమ్మినారు అలా స్థిరాస్థి మొదటగా అమ్మిన వారి వరకు తెలియజేసే పత్రాలను లింకు పత్రాలు అంటారు.లింకు పత్రాలు అన్నీ సవ్యంగా ఉంటేనే స్థిరాస్థి కొనుగోలు చేయడం చాలా ముఖ్యమైనది.

పవర్ ఆఫ్ అటార్నీ పత్రముల పరీక్ష: పైన తెలియజేసిన విధంగా లింకు పత్రాలలో ఎవరైన అమ్మకముదారు పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా అమ్మినచో అట్టి పత్రములోని నియమ నిబంధనలు ఏమిటి, ఎలాంటి నిబంధన ద్వారా అమ్మకము జరిపినారో ఈ పత్రాల ద్వారా తెలుస్తుంది. ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తులు కలిసి మరొక వ్యక్తికి ప్రోపర్టీని అమ్మే హక్కును ధారాదత్తం చేయడమే "పవర్ ఆఫ్ అటార్నీ" అంటారు.

లేఔట్ పత్రాలు పరీక్ష : ఏదైనా ఇల్లును లేదా ఇంటి స్తలం కొంటున్నప్పుడు సంబంధిత అధికార సంస్థల ద్వారా అట్టి స్థలం లేఔట్ అనుమతులు ఉండాలి. ఇట్టి లేఔట్ అనుమతులు ఉన్న స్తలాలను మాత్రమే కొనుగోలు చేయాలి. కావున లేఔట్ అనుమతి పత్రములను పరీక్షించుకోవడం ఎంతో ముఖ్యము. తగిన లేఔట్ అనుమతులు ఉన్న స్థలాలకు హోమ్ లోన్ అనేది చాలా సులభంగా లభిస్తుంది. లేఔట్ అనుమతులు ఉన్న స్థలాలో నిర్మాణాలకు టాక్స్ లేదా ఇతర శిస్తులు చాలా సరళతరంగా ఉంటాయి. లేఔట్ లేని స్థిరాస్తులకు అధిక టాక్స్ చెల్లింపులు ఉంటాయి.

భూమి కన్వర్షన్ పత్రముల పరీక్ష: వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మారుస్తూ సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా అనుమతులు పొందినటువంటి వ్యవసాయేతర భూములను కన్వర్షన్ భూములు అంటారు. ఇలాంటి ఒక వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకున్న తర్వాతే , అట్టి వ్యవసాయేతర భూమిలో వేసినటువంటి లేఔట్ స్థలాలలో మాత్రమే ఇంటి స్థలములను కొనాలి.

ఒకవేళ వ్యవసాయ భూమినే కొంటున్నట్లైతే వ్యవసాయేతర భూముల కన్వర్షన్ అనేది అవసరం లేదు. కానీ తగిన భూమి శిస్తు విషయాలు పరీక్షించుకోవడం చాలా ముఖ్యమైనది. , ఇట్టి వ్యవసాయ భూమి స్వభావము ఎలాంటిది అనేది పరీక్షించుకోవడం ఎంతో ముఖ్యమైనది. ఒకవేళ కొంటున్న భూమి గ్రామ కంఠం భూమి లేదా ఇనామ్ భూమి లేదా ప్రభుత్వ భూమి అయినచో ఇలాంటి భూములను కొనరాదు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా సరే స్థిరాస్థి పైన హక్కులు, వంశ పారంపర్యమైన హక్కులు లేదా అనువంశిక హక్కులు మొదలైన అంశాలను కూడా పరీక్షించుకోవాలి. దీనికి తగిన అనుభవము ఉన్న అడ్వకేట్ ద్వారా పరీక్ష జరిపించుకుంటే ఇందులో న్యాయపరమైన అంశాలు ఏమైనా తెలుసుకుని అట్టి అడ్వకేట్ సలహా ప్రకారం కొనుగోలు చేయడం ఎంతో ఉత్తమమైనది.



ఏజే కరణ్‌లాల్
అడ్వొకేట్, 9492557496
advocateajkl@gmail.com

# భద్రతలో అలసత్వం.. మృత్యువు ఆహ్వానం

## ..నేడు జాతీయ భద్రత దినోత్సవం..

ప్రభుత్వాలు, పరిశ్రమలు ఎన్ని ప్రచారాలు నిర్వహించినా, క్షేత్రస్థాయిలో భద్రత అనేది నేటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోతోంది. భద్రతా వారోత్సవాలు కేవలం బ్యానర్లు, నినాదాలకే పరిమితమవుతున్నాయా? అన్న సందేహం కలుగుతోంది. మన దేశంలో ప్రతి సంవత్సరం మార్చి 4న జాతీయ భద్రత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 1966లో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ (ఎన్ఎస్సీ)ను స్థాపించిన రోజును పురస్కరించుకుని, పని ప్రదేశాలలో, దైనందిన జీవితంలో భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. 2026 సంవత్సరానికి గానూ 'సురక్షితమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలను భాగస్వాములను చేయడం, విద్యావంతులను చేయడం, సాధికారత కల్పించడం' అనే ఇతివృత్తంతో ఈ వేడుకలు జరుగుతున్నాయి. గణాంకాల ప్రకారం, భారతదేశంలోని రిజిస్టర్డ్ ఫ్యాక్టరీలలో ప్రతిరోజూ సగటున ముగ్గురు కార్మికులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అన్‌ఆర్గనైజ్డ్ రంగంలో ఈ సంఖ్య ఇంకా



ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సరైన శిక్షణ లేకపోవడం, నాసిరకం రక్షణ పరికరాలు, యాజమాన్యాల లాభాపేక్షే ఇందుకు ప్రధాన కారణాలు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం వెనకడుగు వేస్తోంది. వేల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నా, దోషులకు శిక్షలు పడటం చాలా తక్కువగా ఉండటం వ్యవస్థలోని లోపాన్ని ఎత్తిచూపుతోంది. నిత్యం వేల సంఖ్యలో జరుగుతున్న రహదారి ప్రమాదాలు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం వంటి అంశాల్లో పౌరుల బాధ్యతారాహిత్యం కనిపిస్తుండగా, గుంతల రోడ్లు, అస్తవ్యస్తమైన మౌలిక సదుపాయాలు పాలకుల అలసత్వానికి నిదర్శనం. భద్రత అనేది సంవత్సరానికి ఒకరోజు చేసే వేడుక కాదు; అది నిత్యం పాటించాల్సిన జీవన విధానం. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో మానవ ప్రాణాలకు ఇచ్చే విలువ అత్యంత కీలకం. ప్రభుత్వాలు కఠినమైన తనిఖీలు చేపట్టాలి, యాజమాన్యాలు కార్మికుల క్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలి, పౌరులు స్వీయ నియంత్రణను పాటించాలి. భద్రతలో అలసత్వం అంటే మృత్యువుకు ఆహ్వానం పలకడమే.

– నవ్య

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.